తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





# దేశరాజకీయాలను శాసించే నాయకుడు చంద్రబాబు : మంత్రి ఆనం



నాయుడుపేట, ఏప్రిల్ 20 ప్రభాతవార్త; దేశరాజకీయాలను శాసించే నాయకుడు మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని, రాష్ట్రదేవాదాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి అన్నారు. ఆయన ఆదివారం నాయుడుపేట మండలంలోని పుదూరులో జరిగిన కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లడుతూ గత ప్రభుత్వం పదిలక్షల కోట్లు అప్పులు చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామిలను నిరవేర్చడం జరుగుతుందన్నారు. సూపర్‌సిక్స్ పథకాల్లో మహిళలకు ఉచిత గ్యాస్ సిలీండర్ మొదటి విడతలో అందించడం జరిగిందన్నారు. రైతు భరోసా, తల్లికి వందనం మే నెలలో అర్హులైన వారి ఖాతాలో జమచేయడం జరుగుతుందన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినం సందర్భంగా మంత్రి చేతుల మీదుగా కేక్‌కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. అనంతరం వైసిపి నాయకులు గోనుపల్లి గురుమూర్తి, ఎస్‌జె జూలరి అధినేత పొట్లపూడి రాజేష్,మార్కెట్ సంఘం నాయుడు సురేష్ పలువురు నాయకులు, కార్యకర్తలు మంత్రి ఆనం ఆధ్వర్యంలో తెదేపాలో చేరారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ,నెలవల సుబ్రమణ్యం, జిల్లాపార్టీ అధ్యక్షుడు నరసింహయాదవ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు.

# గోమాతల మొర వినేదెవరు!

## గోశాలలో సంరక్షణపై వీడని అనుమానాలు!



ప్రభాతవార్త-తిరుపతి:
సకలదేవతాస్వరూపాలుగా గోమాతలను పూజించే హిందూ సాంప్రదాయంగా అనాదిగా వస్తోంది. ధార్మికసంస్థ టిటిడి ఆధీనంలోని ఎస్వీ గోశాలలో గత కొంతకాలంగా నెలకొన్న అక్రమాలతో, గోవుల మరణాలతో గోమాతల మొర వినేదెవరనేది? ఇప్పుడు గోసంరక్షకులు, శ్రీవారి భక్తుల్లో చర్చనీయాంశంగా మారింది. గోశాలలో 3వేల వరకు పలు రకాల గోవులు ఉన్నాయి. వీటిల్లో 550వరకు నాణ్యమైన, ఉన్నతజాతి దేశవాళీ ఆవులు సాహివాల్, గిర్,కాంకీర్ జాతుల ఆవులు గుజరాత్,పంజాబ్, రాజస్థాన్ నుండి గోశాలకు తీసుకువచ్చారు. గోప్రేమికులు దాతలుగా వీటిని విరాళాల రూపంలో అందించారు. ఈ గోవుల నుండి రోజువారీగా 1,500లీటర్ల పాలు సేకరించి తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి కైంకర్యాలకు వినియోగిస్తున్నారు. గోశాలలో గోవుల సంరక్షణకు 250మంది వరకు సిబ్బంది సేవలందిస్తున్నారు. గోవులకు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడుపూటలా పచ్చిగడ్డి, దాణా, పౌష్టికాహారమైన దాణా అందిస్తున్నారు. గోశాలలోనే దాణా తయారుచేసే యంత్రాలను నెలకొల్పారు. గతంలోనూ గోశాలలో వయోభారం, వ్యాధుల బారినపడి ప్రతినెలా గోవులు మరణించిన ఘటనలు ఉన్నాయి. అప్పట్లోనూ ఈ ఉదంతం వెలుగుచూడలేదు.పైగా దేశవాళీ ఆవుల పేరుతో గత ఐదేళ్ళలో అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వంలోని టిటిడి ట్రస్ట్‌బోర్డు పెద్దలు కూడా స్వదేశీ ఆవులను తీసుకువచ్చి గోశాలలో సంరక్షణ చేస్తున్నారు. గత ఐదేళ్ళలోనూ ఆవులు మృతి చెందాయనేది ఇటీవల టిటిడి ఈఓ శ్యామల రావు, గోశాల మేనేజర్ మీడియాకు అధికారికంగా లెక్కలు వెల్లడించారు. వృద్ధాప్యం, వ్యాదుల కారణంతో 191 గోవులు మృతి చెందాయని వివరణ ఇచ్చారు.

**-గోసంరక్షణ భారంగా మారుతోందా!?:**

ఏటా 5వేలకోట్ల రూపాయలుపైగా వార్షిక బడ్జెట్ ఆదాయం ఉన్న టిటిడి ధార్మికసంస్థలో ప్రత్యేకంగా తిరుపతి,తిరుమలలోని గోశాలలో దేశీయగోవులు, ఇతర రకాల గోవుల సంరక్షణ భారంగా మారిందా?అనే అనుమానాలు కూడా ఇప్పుడు భక్తుల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ కారణంగానే గోవులు మరణిస్తున్నా వాటికి అవసరమైన వైద్యం, మందులు ఎందుకు అందుబాటులో లేకపోతోందా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. టిటిడి గోవుల సంరక్షణకు ప్రత్యేకంగా ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్ కూడా నిర్వహిస్తోంది. ఈట్రస్ట్‌కు గోప్రేమికులు, దాతలు భారీగా విరాళాలందిస్తు న్నారు. దీనిద్వారా వచ్చే వడ్డీతో గోవుల సంరక్షణ మరింత సులభమే అవుతుంది. అయితే ఎస్వీ గోశాలలో గోవుల సంరక్షణలో లోపాలు ఏమిటన్నది ఇప్పుడు అందరిలోనూ నెలకొన్న అనుమానాలు. గోశాలలో ఉన్న గోవులు,దేశీయ జాతి ఆవులు ఆరోగ్యం గానే ఉన్నాయా?అనే సంశయం నెలకొంది. గత ఐదేళ్లలో కాలంచెల్లిన మందులు, పాచిపట్టిన నీరు, పురుగులుపడ్డదాణా అందిం చారని ఇటీవల టిటిడి ఈఓ శ్యామలరావు సంచలన వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. గత ఐదేళ్ళలో చనిపోయిన గోవుల వివరాలను కూడా నమోదు చేయలేదని, టిటిడి విజిలెన్స్ నివేదికల్లో నమోదైనా ఎలాంటి చర్యలు తీసుకోకుండా దాచిపెట్టారని విమర్శించారు. గోశాలలో గోధాణా కాంట్రాక్టర్ వద్ద 78లక్షలు రూపాయలు కమీషన్ నొక్కేశారని ఈఓ సంచలన ఆరోపణ చేయడం జరిగింది. ఇప్పటికైనా ఉన్న గోవుల సంరక్షణకు మెరుగైన చర్యలు తీసుకోవాలని శ్రీవారి భక్తులు కోరుతున్నారు.

# బీసీల రణభేరి... దేనికి సంకేతం!

## - జూన్ 6న తిరుపతి నుంచి ప్రారంభం



తిరుపతి కలెక్టరేట్, ప్రభాతవార్త
ఏపీలో అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే కూటమి ప్రభుత్వంపై బీసీలు రణభేరి పేరుతో జూన్ 6న తిరుపతిలో నిర్వహించనున్న బీసీల ఆత్మగౌరవ సభ (బీసీల రణభేరి) దేనికి దారి తీస్తోందో అర్థకాని పరిస్థితి ఏర్పడింది. బీసీలే తెలుగుదేశం పార్టీకి వెన్నెముక అని చెప్పుకునే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకు, బీసీల సత్తా ఏమిటో చూపెట్టడానికి వచ్చిన డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు సవాలా అనేది తిరుపతిలో నిర్వహించే బీసీ రణభేరి ద్వారా తెలియనుంది. మొత్తం మీద వైసీపీ పార్టీని పక్కన బెడితే కూటమికి మేమే ప్రతిపక్షం అంటూ బీసీ జాతీయ, రాష్ట్ర నేతలు, బీసీ యువత, మహిళా నేతలు నుంచి పెద్ద ఎత్తున వినిపిస్తున్న భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. ఒకానొక దశలో బీసీలే కూటమికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయనున్నట్లు బీసీ జాతీయ, రాష్ట్ర ముఖ్యనేతల నుంచి వినిపిస్తున్న విశ్వసనీయ సమాచారం. ప్రధానంగా బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కూటమి బీసీల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలం అయిందని వారి వాదన. ఎందుకంటే ఓ బీసీకి సమస్య వచ్చి పోలీస్‌స్టేషన్, తహశీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో, చివరికి గ్రామ సచివాలయంకు వెళ్ళినా ఆ నియోజక వర్గ ఎమ్మెల్యే ఫోన్, లెటర్ ద్వారా, స్వయంగా వచ్చి అయినా చెబితే తప్పా పోలీస్‌స్టేషన్లల్లో, తహశీల్దార్ కార్యాలయాల్లో, ఎంపీడీవో, చివరికి గ్రామ సచివాలయాల్లో బీసీలకు పనులు జరగడం లేదు అనేది బీసీ సంఘాల జాతీయ, రాష్ట్ర నేతల నుంచి పెద్ద ఎత్తున వినిపిస్తున్న ఆరోపణలు. ఓ బీసీ తన బాధను వినతి పత్రాలు వినతి పత్రాలు, ఫిర్యాదుల ద్వారా చెప్పుకుంటుంటే ఆ బీసీ బాధితుడికి జరిగిన అన్యాయాన్ని గురించి పూర్తి విచారణ జరిపి న్యాయం చేయాలే తప్ప ఎమ్మెల్యే చెప్పడం ఏమిటని వారి నుంచి వినిపిస్తున్న విమర్శలు.ఇందుకేనా బీసీలందరూ కలిసి ఓట్లు వేసి కూటమిని గెలిపించుకుందీ అంటూ వారి నుంచి వినిపిస్తున్న ప్రధాన వ్యాఖ్యలు. అంతే కాకుండా క్రింది స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పెద్ద పెద్ద హోదాల్లో ఉన్న బీసీ మంత్రులు కూడా బీసీ సమస్యలను పట్టించుకోక పోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నేపథ్యం. మరో పక్క ఓబీసీ కుల గణన సర్వే జరగాలని దాని ప్రకారం బీసీలకు రిజర్వేషన్ కల్పించాలన్నదే వారి ప్రధాన డిమాండ్. 4,5 శాతం ఉండే అగ్రకుల వర్గాలకు చెందిన రెడ్లు, నాయుడు, బ్రాహ్మణులు 95 శాతం ఉండే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, ఇతర కులాలను పాలించడం, శాసించడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారూ. చివరికి నిద్రావస్థలో ఉన్న బీసీ మంత్రులు మేల్కోపి గత ఎన్నికల్లో సీఎం నారా చంద్రబాబు నాయుడు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు బీసీలకు ఇచ్చిన హామీలను, సమస్యలను పరిష్కరించడంతో పాటు అత్యధిక శాతం ఉన్న బీసీ భవిష్యత్ కార్యాచరణ రూపొందించే విధంగా ప్రణాళికలు చేపట్టనున్నట్లు ఈ ఆత్మగౌరవ సభ ద్వారా తెలుస్తోంది. ఈ సభ ద్వారానైనా బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ బడుగు, బలహీన వర్గాల ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా మరింత ఎదుగుతారని, ఎదగాలని, ఆ దిశగా సీఎం నారా చంద్రబాబు నాయుడు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీసీ మంత్రులు స్పందించి బీసీలకు అండగా ఉంటారని మనందరం ఆశిద్దాం. దీనిపై కూటమి నేతలు, బీసీ మంత్రులు ఏవిధంగా స్పందిస్తారో వేచి చూద్దాం.

# సెప్టిక్ ట్యాంకులోకి దిగి ఒకరి మృతి... మరొకరి పరిస్థితి విషమం!



పుంగనూరు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త: పట్టణంలో శాంతినగర్‌లో ఆదివారం విషాదం నెలకొంది. ఇంటి సెప్టిక్ ట్యాంకులోని బురదను బయటకు తీయడానికి ప్రయత్నించే క్రమంలో ఒక వ్యక్తి బురదలో కురుకుపోయి మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని శాంతినగర్ 6వ వీధికి చెందిన యుగంధర్ నాయుడు నివాసంలో సెప్టిక్ ట్యాంక్ నిండిపోయింది. ఆదివారం ఉదయం మదనపల్లెకు చెందిన హేమంత్, రవి అనే ఇద్దరు వ్యక్తులు సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయడానికి ఇంటి యజమానితో ఒప్పందం చేసుకున్నారు. ఈక్రమంలో ఇద్దరు ట్యాంక్ శుభ్రం చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు ఉన్నఫళంగా బురదలో కూరుకుపోయారు. స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం పంపారు. అగ్నిమాపక కేంద్ర అధికారి సుబ్బరాజు అద్దంలో వీరిని బయటకు తీసే ప్రయత్నంలో హేమంత్ (27) మృతి చెందారు. విషమ పరిస్థితిలో ఉన్న రవిని కాపాడి అత్యవసర చికిత్స నిమిత్తం మదనపల్లికు తరలించారు. ప్రమాద ఘనటపై విచారిస్తున్నట్లు పుంగనూరు అర్బన్ సిఐ తెలిపారు.

# చంద్రబాబు పేరున... భక్తులకు అన్నప్రసాదం వితరణ

## -రూ.44లక్షలు విరాళమిచ్చిన భాష్యం విద్యాసంస్థలు



తిరుమల,ఏప్రిల్ 20ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు75వ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ 44లక్షలు రూపాయలు విరాళం అన్నప్రసాదానికి అందించారు. ఈ విరాళాలతో ఒకరోజంతా భక్తులకు ఉదయం నుండి రాత్రివరకు నిరంతరాయంగా చంద్రబాబుపేరున అన్నప్రసాదం వడ్డించారు.

# వేసవి సెలవులతో కొండ కిటకిట

## -ఇబ్బందులు లేకుండా నిరంతరాయంగా సేవలు



తిరుమల,ఏప్రిల్ 20ప్రభాతవార్తప్రతినిధి: వేంకటేశ్వరస్వామి దర్శనార్థం ఆదివారం ఉదయానికి తిరుమలలో లక్షమందికిపైగాభక్తులు ఉన్నారు. వేసవి సెలవులు.. ఆపై వారాంతం కావడంతో భక్తులు పోటెత్తారు. ఉదయానికే తిరుమలలో వైకుంఠం-1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి భక్తుల క్యూలైన్లు ఆలయం వెలుపల కృష్ణతేజ భవనం వరకు చేరాయి. టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. ఆదివారం ఉదయం నారాయణగిరి ఉద్యానవనాల్లోని క్యూలైన్లను అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, డిప్యూటీ ఈఓలు పి.హరీంధ్రనాథ్, రాజేంద్రనాథ్, విఎస్‌ఓ సురేంద్రతో కలసి తనిఖీలు చేశారు. భక్తులకు అందుతున్న సేవలు, రద్దీకిఅనుగుణంగా క్యూలైన్ల నిర్వహణపై సూచనలు చేశారు. భక్తులు భారీగా తిరుమలకు చేరుకోవడంతో గదుల కోసం సామాన్యభక్తులు నిరీక్షిస్తున్నారు. ఖాళీస్థలాల్లో, పార్కులు, రోడ్లపై భక్తులు విశ్రాంతి తీసుకుంటున్నారు.



# స్వర్ణముఖిలో ఇసుకను... 'తోడే'స్తున్నారు



స్వర్ణముఖి నది నుంచి జెసిబిలు ఏర్పాటు చేసి ఇసుకను తవ్వుతున్న దృశ్యం

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 20 ప్రభాతవార్త : పవిత్ర జీవనది 'స్వర్ణముఖిని' ఇసుకాసురులు తోడేస్తున్నారు. జీవనదికి ఏడాదిలో ఒక సారి వరద వస్తుంది, ఒక సారి నదికి, వరద వస్తే నది నిండా ఇసుకుపేరుకు పోతుంది. భూగర్భజలాలను ఇసుకాసురులు మింగేస్తున్నారు. అయితే పట్టణానికి కూత వేటు దూరం నుంచి స్వర్ణముఖి నది నుంచి యథేచ్ఛగా ఇసుకను తోడేస్తుంటే అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. ముఖ్యంగా పర్యవేక్షించాల్సిన ఇరిగేషన్ శాఖ పత్త లేదు. శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపం లోని ఓ కార్పొరేట్ లాడ్జికి సమీపంలో కొత్త వంతెన దుగువ నుంచి ఇసుకను ఇష్టమొచ్చినట్లు తోడేస్తున్నారు.

**పగలు,రేయి తేడా లేకుండా:**

శ్రీకాళహస్తిలోని స్వర్ణముఖి నదిలో బంగారు చామన చాయ కల్గిన ఇసుక అందుబాటులో వచ్చింది. ముఖ్యంగా జల వినాయకుని ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వంతెన బైపాస్ వంతెన వద్ద విచ్చల విడిగా పగలు రేయి తేడా లేకుండా తోడేస్తున్నారు. ముఖ్యంగా అందరు చూస్తుండగానే ఎంపిడిఓ కార్యాలయం శుకబ్రహ్మ శ్రమం వెనుక జెసిబిలను ఏర్పాటు చేసారు. అక్కడ నుంచి ట్రాక్టర్లలో యథేచ్ఛగా ఇసుకను తోడేస్తుంటే ఏ అధికారి పట్టించుకోవటం లేదు. మైనింగ్‌శాఖ, రెవెన్యూశాఖల అధికారులు పట్టించుకోవటం లేదు. అధికారుల సహాకారంతోనే స్వర్ణముఖిని తోడేస్తున్న ట్లు సమాచారం.రోజు వందలాది ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్లతో తరలించుకుంటున్నారు. గతంలో పగలు పట్టణంలో ఇసుక ట్రాక్టర్లు కనబడేవి కాదు.కానీ ప్రస్తుతం పట్టణంలో ట్రాఫీక్ రద్దీగా ఉన్న సమయంలో కూడా ఇసుక ట్రాక్టర్లు దర్శనమిస్తున్నాయి. అంతేకాక ఏ మాత్రం డ్రైవింగ్ అనుభవం లేని డ్రైవర్లతో ఇసుక వ్యాపారాన్ని ఇసు కాసురులు చేస్తున్నారు. కానీ ట్రాక్టర్లకు సంబంధించి ట్రాపిక్‌కు ఇబ్బంది కల్గుతున్నా పోలీసులు పట్టించుకోవటం లేదు.దాంతో నిత్యం ట్రాపిక్ చిత్తడిలో జనం ఇబ్బందులు పడుతున్నారు.

**అడుగింటుతున్న భూగర్భ జలాలు:**

శ్రీకాళహస్తిలోని స్వర్ణముకి నదిపై నాలుగు వంతెనలున్నాయి.గతంలో వంతెనకు కేవలం 9-10అడుగుల్లో ఇసుకు ఉండేది నేడు పరిస్థితి గమనిస్తే కనీసం 30 అడుగుల లోతుకు ఇసుక వెళ్ళింది. ఏడాదిలో ఒక సారి నది పారితే కనీసం నాలుగైదు సంవత్సరాలు చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు సజావుగా ఉండేది. కానీ నేడు పరిస్థితి పరిశీలిస్తే నదీ తీర ప్రాంతాల్లో కూడా నీరు లభించటం లేదు. బోర్లలో నీటి మట్టం తగ్గిపోయింది. ఇక చుట్టుపక్కల గ్రామాల్లో వ్యవసాయ భూముల్లోని బోర్లలో కూడా నీటిమట్టం తగ్గిపోతుంది. ఇప్పటికైనా పాలకులు స్పందించాల్సి ఉంది. అధికారులు మొద్దు నిద్ర నుంచిమేల్కొనాలి. కనీసం సమాజం భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొవాల్సి ఉంది.

# అక్రమ మట్టి తరలింపులో...మాకు అడ్డే లేదు!

## -అధికారుల కనుసన్నల్లోనే అక్రమ రవాణా..! -విధులను విస్మరించి చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం..!



అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలు

గంగవరం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త : చెరువులను పరిరక్షించాల్సిన నీటిపారుదలశాఖ, రెవెన్యూశాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధి కారుల పర్యవేక్షణ లోపంతో స్థానిక అధికారులదే రాజ్యం అవుతుంది. అక్రమ రవాణాను అరికట్టడం కోసం ప్రజలు నీటిపారుదలశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలన్న వారు అందుబాటులో లేకపోవడం, స్థానిక తహశీల్దారు మాదవరాజుకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫిర్యాదు చేసినా ఫలితం కనబడలేదని ప్రజలు వాపోతున్నారు. చెరువులు పరిరక్షణ ఎవరి బాధ్యత..? అక్రమ రవాణాపై, ఆక్రమణలపై చర్యలు తీసుకునే బాధ్యత నీటిపారుదలశాఖకు లేదా, అక్రమాలపై ప్రశ్నిస్తే రెవెన్యూ విభాగానికి లెటరు పెట్టాం, వారిని అడగండి అంటూ నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యపు సమాధానాలతో ప్రజలు విస్తుపోతున్నారు. వివరాల్లోకి.. గంగవరం పంచాయతీ పరిధిలోని దండపల్లెరోడ్డు పక్కనే ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా పలమనేరు మాజీ సబ్‌రిజిస్ట్రర్ బంధువుల వ్యవసాయ భూమిని రియల్ ఎస్టేట్ వెంచర్‌గా ఏర్పాటు చేస్తున్నారు. ఇదే అదునుగా భావించిన అధికార పార్టీకి చెందిన మండల నాయకుడు ఒకరు రియల్ ఎస్టేట్ నిర్వాహకుల వద్దకు వెళ్ళి మీరు లే అవుట్ వేయాలంటే ప్రభుత్వ అనుమతులు ఉండాలి. మీ లే అవుట్‌కు కావల్సిన మట్టిని తనకు ఒప్పందం ఇస్తే మీ లేఅవుట్‌కు కావల్సిన మట్టితో పాటు అన్ని అనుమతులను తానే దగ్గర ఉండి తీసిస్తానని అధికారులకు తాను ఎంత చెప్పితే అంతేనని వారితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. నిర్వాహకుల వద్ద నుండి లే అవుట్‌కు 3000 టిప్పర్‌ల మట్టి అవసరం ఉంటుందని ఇందుకోసం టిప్పర్ మట్టి రూ.2600 వంతున మొత్తం దాదాపు రూ.75 లక్షలకు ఒప్పదం కుదుర్చు కున్నట్లు వినబడుతున్నాయి. కొందరి అవినీతి అధికారులు కనుసన్నల్లోనే ఈ వ్యాపార తంతు కొనసాగుతుండడంతో ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నెల 18న రాత్రి జోగిండ్లుకు చెందిన రైతులు, గ్రామస్తులు తమ గ్రామంలోని చెరువులో పట్టపగలే యథేచ్ఛగా భారీ యంత్రాలతో మట్టి దందా జరుగుతుందని స్థానిక తహశీల్దారుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో స్థానిక ప్రజలే అడ్డుకున్నారు. దీంతో యువ నాయకుడు మేము అధికార పార్టీ వాళ్ళమని మాకు అధికారులు అనుమతులు ఉన్నాయని బెదిరించడంతో, అక్కడి గ్రామస్తులు నీకు అనుమతి ఇచ్చిన అధికారులను ఇక్కడికి రమ్మను అని తిరగబడడంతో అక్కడి నుండి మబ్బువాళ్ళపేట సమీపంలోని జమ్మొడ్డులో నుండి మట్టిని అక్రమ రవాణా కొనసాగుతున్న పట్టించుకునే వారే కరువయ్యారు. అడపా దడపా పోలీసులు మట్టి అక్రమ రవాణాను అరకట్టేందుకు పట్టుకున్న వాహనాలకు జరిమానాలు కోసం రెవెన్యూ, మైనింగ్‌శాఖల అధికారులకు అప్పగించిన ముందుగానే ఆయా శాఖలలోని కొందరు అవినీతి అధికారులు అక్రమార్కులతో కుమ్మక్కై, మామూళ్ళకు అలవాటుపడి తిరిగి యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా చేస్తున్నారు.అక్రమంగా ఇసుక మాఫియాను పెంచిపోషిస్తున్న అధికార యంత్రాంగాలు ఇకనైనా జవాబుదారీగా విధులు నిర్వహించాలని, ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిళ్ళకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టరును ప్రజలు కోరుతున్నారు.

# విజనరీ లీడర్ చంద్రబాబు : ఎమ్మెల్యే నెలవల



సూళ్ళూరుపేటలో సిఎం చంద్రబాబు జన్మదిన వేడుకల దృశ్యం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 20 ప్రభాతవార్త : రాష్ట్ర అభివృద్ధిని ఆకాంక్షిస్తూ పనిచేసే విజనరీ లీడర్ చంద్రబాబునాయుడని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఆదివారం చంద్రబాబునాయుడు 75వ జన్మదిన సంబరాలును సూళ్లూరుపేటలో ఘనంగా నిర్వహించారు. రైల్వేగేటు వద్ద ఉన్న టిడిపి కార్యాలయంలో చంద్రబాబునాయుడు బర్త్‌డే కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మున్సిపల్ మహిళా కార్మికులకు చీరలు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్రం త్వరితగతిన అభివృద్ధి పథంలోకి వెళుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా చంద్రబాబు నాయుడు నాయకత్వానికి మద్దతు పలికితే నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణం త్వరలోనే సాధ్యమవుతుందని చెప్పారు. అలాగే తిరుపతి పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జన్మదిన సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేనాటి సతీష్‌రెడ్డి మాట్లాడుతూ దార్శనికుడు, మార్గదర్శి చంద్రబాబునాయుడని, ఆయన మరెన్నో పుట్టినరోజులు జరుపుకుని నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణానికి ముందడుగు వేయాలని భగవంతుని ప్రార్థిస్తు న్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ఆకుతోట రమేష్, చిట్టేటి పెరుమాళ్లు, మేడా సాయి, బుద్ధి విజయలక్ష్మి, ఎస్ఎన్ మునిరాజా, సుబ్బయ్య, కెవిరెడ్డి, ఎజి కిషోర్, కొండలరావు, కొక్కు శంకరయ్య, వెంకటేష్ యాదవ్, కుదిరి పెంచలయ్య, ఎన్.రాజసులోచనమ్మ, అలవల శ్రీనివాసరావు, నాయుడుపేట నాయకులు కామిరెడ్డి అశోక్‌రెడ్డి, చెంగయ్య, గండవరం రమేష్‌రెడ్డిలు పాల్గొన్నారు.

# ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

## - ఆలయాల్లో అభిషేకాలు,అన్నదానాలు,రోగులకు పళ్లు పంపిణీ



కుప్పంలో సిఎం చంద్రబాబు జన్మదిన వేడుకల దృశ్యం

కుప్పం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలను కుప్పంలో తెదేపా నేతలు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం ఉదయం స్థానిక శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో సిఎం చంద్రబాబు పేరిట ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. కుప్పం అన్న క్యాంటీన్‌లో పేదలకు మూడు పూటల ఉచిత ఆహారాన్ని పంపిణీ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయం, బస్టాండు వద్ద భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలు, ప్రజలకు పంచి పెట్టారు. ఈసందర్భంగా ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు నిండు నూరేళ్ల ఆరోగ్యంతో, ఆనందంతో ఉంటూ రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు బంగారుబాట వేయాలని ఆకాంక్షించారు. కుప్పంతో సిఎం చంద్రబాబుకు 36 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. కుప్పంతో పాటు రాష్ట్ర చరిత్రను తిరగాసిన వ్యక్తి సిఎం చంద్రబాబు అన్నారు. ఆయన నేతృత్వంలో నవ్యాంధ్రప్రదేశ్ వికసిత ఆంధ్రప్రదేశ్‌గా ముమ్మందు మారబోతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఎం పిఎ మనోహర్, రాష్ట్ర నేతలు బిఆర్ సురేష్‌బాబు, గోపీనాథ్, వెంకటేష్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ సుధీర్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి ఆర్ముగం, ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము, కౌన్సిలర్లు సోమశేఖర్, జాకీర్, సెల్వరాజ్, నేతలు సత్యేంద్రశేఖర్, కన్నన్, డికె పల్లి మణి, శివదేవర్, ప్రతాప్, రవి, మంజు,డికెపల్లి భాస్కర్, గిరిధర్‌బాబు, జనసేన నరేష్, తెలుగుమహిళ అధ్యక్షురాలు అనసూయ, మహిళా నేతలు సుగుణమ్మ, స్వాతి, పద్మమ్మ, వసంతమ్మ, తిరుమగళ్, గీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు



**పూతలపట్టు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని పూతలపట్టు మండల నాయకులు పికొత్తకోట పంచాయతీ పరిధిలో గురుకుల పాఠశాలలో నిర్వహించారు. ఆదివారం శాసనసభ్యులు కలికిరి మురళీమోహన్ ఆధ్వర్యంలో కార్యక్రమం సందర్భంగా కేక్ కట్ చేయడం జరిగింది. ప్రజాసేవలో మరింత స్ఫూర్తిగా కొనసాగాలని టిడిపి సీనియర్ నాయకుడు గుంటూరు మురళి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు యువరాజు నాయుడు చంద్రమోళి పేట అగ్రహారం సర్పంచి చంద్ర, పాటూరు చిన్నబ్బా యాదవ్, గురుకుల పాఠశాల విద్యార్థులు సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు



**కాణిపాకం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఆదివారం కాణిపాకంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక పాత సంతగేటు వద్ద ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. ఈకార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని 75 కిలోల కేక్‌ను కట్ చేశారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, ఆలయ మాజీ ఛైర్మన్ మణినా యుడు, మాజీ సర్పంచ్ మదుసూధన్‌రావు, ఐరాల జడ్పీటీసీ సుచిత్ర కన్నయ్యనాయుడు, మాజీ జడ్పీటీసీ ఎం.లత, స్థానిక నాయకులు హేమాద్రినాయుడు, చిన్ని, పూర్ణచంద్రరావు, నరసింహులు నాయుడు, గంగారపు హరిబాబునాయుడులతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

## తవణంపల్లెలో ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

**తవణంపల్లె, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను



ఆదివారం మండల కేంద్రం తవణంపల్లెలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దిలీప్‌నాయుడు, ప్రధాన కార్యదర్శిమధుయాదవ్‌లఆధ్వర్యం లోజరిగిన స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని 75 కిలోల కేక్‌ను కట్ చేసి పంచి పెట్టారు. మండల పార్టీ అధ్యక్షుడు దిలీప్‌నా యుడు, ప్రధాన కార్యదర్శి మధుకుమార్ యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జి సునీల్ చౌదరి, బంగారుపాళ్యం ఏఎంసీ ఛైర్మన్ భాస్కర్‌నాయుడు, నాయకులు పట్నం గోపీయాదవ్, కోదండయ్య, శరవణకుమార్(కుట్టి), సుధాకర్ నాయుడు,వినాయకం, జైపాల్‌లతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా ఈస్టర్ పండుగ వేడుకలు

**తొట్టంబేడు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** పట్టణంలోని కాసాగార్డెన్ సమీపంలో ఉన్న లూథరన్ చర్చిలో ఈస్టర్ పండుగ సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.చర్చి బిషప్ మరియు ఫాస్టర్ రె.మైకెల్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా బిషప్ మైకెల్‌బాబు మాట్లాడుతూ మానవవాళికోసం శిలువతో ప్రాణత్యాగం చేసిన యేసుక్రీస్తు మృతిచెందిన మూడోరోజు సమాధి నుంచి సజీవంగా తిరిగిలేచాడని బైబిల్‌లో చెప్పబడిందన్నారు. క్రీస్తు పుట్టినరోజైన క్రిస్మస్ తర్వాత అంతటి ప్రాముఖ్యత పండుగను పురస్కరించుకుని దేశంలోని అన్ని చర్చిల్లో క్రైస్తవులు దానమిస్తారన్నారు. పండుగను పురస్కరించుకుని అన్ని చర్చిలందు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారని తెలిపారు

## ఐరాలలో ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు



**ఐరాల, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** చంద్రబాబు నా యుడు జన్మదిన వేడుకలను ఆదివారం ఐరాల మం డలంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈసం దర్భంగా మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయ కులు మోతుకూరి సోమశేఖర్‌నాయుడు ఆధ్వర ్యంలో మండలంలోని పొలకల సంతగేటు నందు 75 కిలోల కేక్‌ను కట్ చేసి పంచి పెట్టారు. ఈకార్యక్రమంలో మండల మైనార్టీ నాయకులు జలీల్‌బాషా, జనసేన నాయకులు పూల ప్రభాకర్, నాయకులు మునిరాజులు, ఇంద్రసేన, పులి, హరి, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తును ఊహించగల మేధావి చంద్రబాబు

-టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు



**చంద్రగిరి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కారకాలను ఒడిసి పట్టుకునే భవిష్యత్తును ఊహించగల అపరమేధావి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు అన్నారు. చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలను ఆదివారం మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. ఇందులో భాగంగా టవర్ క్లాక్ వద్ద పసుమయమైన పందిరి క్రింద అధ్యక్షుడు కేక్‌ను కట్ చేసి నాయకులు పరస్పరం తినిపించుకుంటూ చంద్రబాబు జన్మదిన వేడుకలను అంబరాన్నంటేలా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ గౌస్‌భాషా, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, తుడా మాజీ డైరెక్టర్ ఏజి పల్లి బాల, మండల ఉపాధ్యక్షుడు శానంబట్ల తులసిరెడ్డి, తెలుగుయువత మండల అధ్యక్షుడు రాజులగారి వినోద్‌కుమార్‌రెడ్డి, టిడిపి యూనిట్ 40 ఇన్‌చార్జ్ ఆదూరి నాగరాజ, నాయకులు పులికంటి మోహన్‌రెడ్డి, కన్నయ్య నాయుడు, వీరంగారి రమేష్‌రెడ్డి, శివకోటిరెడ్డి, సక్కుర్ ధనంజయరెడ్డి, మంగాపురం భాస్కర్ రాయల్, నాగరాజ రాయల్, హరి, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

**శానంబట్లలో..** శానంబట్లలో టిడిపి మండల ఉపాధ్యక్షుడు శానంబట్ల తులసిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా తొండవాడలో ఆదివారం టిడిపి నాయకుడు పులికంటి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామకమిటీ అధ్యక్షుడు ఉమాపతి రెడ్డి, జగన్మోహన్ నాయుడు తదితరులు ముఖ్యంత్రి నారా చంద్రబాబు జన్మదిన సంబరాలను ఘనంగా జరుపకున్నారు. ఇందులో భాగంగా కేక్ కట్ చేసి నాయకులు తినిపించుకుని, కార్యకర్తలకు పంచిపెట్టారు.

## ఉచిత కంటి ఆపరేషన్లకు 58మంది ఎంపిక



**కుప్పం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75వ జన్మదినం సందర్భంగా కుప్పం సాయిమాతా సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు అధ్వర్యంలో కుప్పంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. మొత్తం 350మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి వారిలో ఆపరేషన్లకు 58మందిని ఎంపిక చేశారు. ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ అన్నిదానాల్లో నేత్రదానం చాలా గొప్పదన్నారు. రాష్ట్ర నేత గోపీనాథ్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, నేతలు శ్రీనివాసులు, సంతోష్, శ్రీకాంత్, వైద్య బృందం శివ, లావణ్య పాల్గొన్నారు.

## వి.కోటలో ఘనంగా సిఎం జన్మదిన వేడుకలు



**వి.కోట, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను వి.కోటలో ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను దేశం నేతలు నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్‌లో కేక్ కట్ చేసి నేతలు, కార్యకర్తలకు పంచారు. మండల టిడిపి అధ్యక్షుడు ఎఎం రంగనాథ్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు ఆరోగ్యంతో నిండునూరేళ్లు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పళ్లు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు రాంబాబు, ధీరజ్, శబరీష్, నారాయణస్వామి, మురుగేష్, కోదండరెడ్డి, వెంకటేష్, ఇక్బాల్, గౌస్‌పీర్ తదితరులు పాల్గొన్నారు.

## వి.కోటలో ఆర్ఎస్ఎస్ రూట్‌మార్చ్



**వి.కోట, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్ఎస్ఎస్) అధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వి.కోటలో రూట్ మార్చ్ నిర్వహించారు. సమదుస్తులు ధరించి చేతికి కర్రలతో బ్యాండ్ వాద్యాల నడమ ఈ మార్చ్ కొనసాగింది. కార్యక్రమంలో బిజెపి, భజరంగదళ్, సంఘ్‌పరివార్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా సిఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు



**రామకుప్పం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను రామకుప్పంలో దేశం నేతలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బందార్లపల్లి క్రాస్ నుంచి పోలీస్‌స్టేషన్ సర్కిల్ దాకా ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచారు. కార్యక్రమంలో నేతలు మునస్వామి, పత్ర నారాయణ, ఆనందరెడ్డి, నరసింహులు, రామూర్తి, చిన్నికృష్ణ, సీతాపతి, గంట్లప్పగౌడు, కృష్ణానాయక్, నందారెడ్డి, గుర్రప్ప, వెంకట్రామగౌడు, రఫీ, కామరాజనాయక్, జయశంకర్, విశ్వనాథ్, వెంకటాచలం, బాలరాజు, సుబ్రి, వెంకటరమణ, ఆదిల్, సురేష్ పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్రప్రదేశ్ సృష్టికర్త చంద్రబాబు : రాష్ట్ర విఫ్ డాక్టర్ థామస్.



**వెదురుకుప్పం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** సాంకేతిక తీసుకువచ్చి, రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన స్వర్ణాంధ్రప్రదేశ్ సృష్టికర్త ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కిందని రాష్ట్ర విఫ్, గంగాధర నెల్లూరు నియోజకవర్గం శాసన సభసభ్యులు డాక్టర్ వియం.థామస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కూడలిలో అంబేద్కర్ విగ్రహం వద్ద చంద్రబాబు 75వ జన్మదిన వేడుకలను ఆదివారం కేక్ కత్తరించి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వారి ఆత్మగౌరవం పెంపొంది ఒచదంకు రామారావు పార్టీని తీసుకువస్తే, చంద్రబాబు విజన్ విజ్ఞానంతో ప్రపంచ దేశాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైపు చూసేలా మార్చిన ఘనత ఆయనే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జీ యుగంధర్ పొన్నా, మండల పార్టీ అధ్యక్షులు లోకనాదరెడ్డి, మాజీ మండల అధ్యక్షులు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ మురళి, రాష్ట్ర సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి మునిచంద్రారెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి నరసింహా యాదవ్, భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రి కుమార్, నాయకులు బియం.రవి, చంద్రబాబు రెడ్డి, భాస్కర్ రెడ్డి, సుధాకర్, గుణశేఖర్ యాదవ్, మోహన్ యాదవ్,మధు, తులసిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కోసం కష్టపడేవారికి సముచిత స్థానం : పెద్దిరెడ్డి



**చౌడేపల్లి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** పార్టీకోసం కష్టపడే వారికి సముచిత స్థానం కల్పిస్తామని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామ చం ద్రా రెడ్డి అన్నారు. వైకాపా రాష్ట్ర విద్యార్థి వి భాగ సంయుక్త కార్యదర్శిగా ఇటీవల నియమి తులయిన కళ్యాణ్ భరత్‌కు మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఆయన నివాసం తిరుపతి నందు తల్లిదం డ్రుల సమక్షంలో నియామక పత్రాన్నందించారు. రాష్ట్ర వైకాపా అధ్యక్షు డు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులకు కళ్యాణ్ భరత్ కృతజ్ఞతలు తెలిపాడు. కృష్ణమూర్తి దంపతులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కృషీవలుడు చంద్రబాబు : గువ్వల



**చౌడేపల్లి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** రాష్ట్రాభివృద్ధి కృషీవలుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడని తేదేపా మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి అన్నారు. బాబు జన్మదినాన్ని పురష్కరించుకొని స్థానిక బస్టాండులో కేక్‌కట్ చేసి, అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. నాయకులు పూల చంద్రమౌళి, ఆవుల రామచంద్రయ్య, శ్రీధర్‌రాజు(గిరి),బోయకొండ సుబ్బు, వేలూరు సుబ్రమణ్యం, పంజానిపల్లిబాబు, కుమార్‌రెడ్డి, మునివెంకటప్ప, పవన్‌కుమార్, గిరినాయుడు, విద్యాసాగర్, విజయ్‌కుమార్, తేదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వారాహిచే 136 మందికి వైద్య పరీక్షలు



**పుంగనూరు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** బెంగళూరు వైదేహి వైద్యులచే ఆదివారం పట్టణంలో 136 మందికి వైద్య పరీక్షలు నిర్వహించబడ్డాయి. స్థానిక వారాహి (గ్రూప్స్) అధ్యక్షుడు పూల హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో బిఎంఎస్ క్లబ్ ఆవరణలో ఏ వైద్య పరీక్షలు నిర్వహించబడ్డాయి. పట్టణ గ్రామీణ ప్రాంతాలు చెంది 136 మందికి పరీక్షలు నిర్వహించగా వారిలో 11 మంది ఎంపికయ్యారు. 11 మందికి వివిధ రకాలైన శస్త్ర చికిత్సలు నిర్వహించాల్సి ఉందని తెలిపారు. వైదేహి హాస్టల్స్ ఆధ్వర్యంలో శస్త్ర చికిత్సలు నిర్వహించి వీరిని తిరిగి స్వగ్రామాలకు చేరుస్తామని పూల హేమంత్ కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్య బృందం, వారాహి గ్రూప్ మెంబర్స్ మోనిక, సాధిక, కిషోర్, మల్లిక, రమ్య, సరిత, తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఎంబిబిఎస్ విద్యార్థినికి ఆర్థిక సాయం



**కుప్పం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** కొత్తపేట టిడిపి ఇన్‌చార్జ్ ముఖేష్ (అప్పు) సిఎం చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా కుప్పం కూర్మాయిపురం హరిజన వాడకు చెందిన నిరుపేద ఎంబిబిఎస్ విద్యార్థి దర్శిని చదువుల నిమిత్తం తనవంతుగా పదివేల రూపాయల ఆర్థికసాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ముఖేష్ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్‌మునిరత్నం, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జ్ సత్యేంద్రశేఖర్ సూచనల మేరకు తాను ఈ సాయం అందించానన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సోమశేఖర్, టిఎన్ఎస్ఎఫ్ మునెప్ప, రాహుల్‌కుమార్, సుకుమార్, మనోహర్, మధు, లోకేష్, మణి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక : కడ పి.డి.



**కుప్పం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంను సోమవారం కుప్పం మండల కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా ఈ కార్యక్రమం జరుగుతుంద న్నారు. ప్రజలు తమ సమస్యలపై నేరుగా వినతిపత్రాలు అందించవచ్చని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## చంద్రబాబు జన్మదినాన రక్తదానాలు



**కుప్పం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** సిఎం చంద్ర బాబునాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని కుప్పంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ఈసంద ర్భంగా రాష్ట్ర టిడిపి ఆర్గనైజింగ్ కార్యదర్శి బిఆర్ సురేష్‌బాబు, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, డికెపల్లి పార్టీ అధ్యక్షుడు డివి భాస్కర్, ఆర్యవైశ్య సంఘ నేత గిరిధర్‌బాబు, కంగుంది ఇన్‌చార్జ్ దివాకర్ తదితరులు రక్తదానం చేశారు. సుమారు 75మంది ఈ సందర్భంగా రక్తదానం చేశారు. అనంతరం వారికి ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేతలు గోపీనాథ్, డాక్టర్ వెంకటేష్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం,మాజీ మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి ఆర్ముగం, ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము, కౌన్సిలర్లు సోమశేఖర్, జాకీర్, సెల్వరాజ్, నేతలు సత్యేంద్రశేఖర్, కన్నన్, డికె పల్లి మణి, శివదేవర్, ప్రతాప్, రవి, మంజు,డికెపల్లి భాస్కర్, గిరిధర్‌బాబు, జనసేన నరేష్, తెలుగుమహిళ అధ్యక్షురాలు అనసూయ, మహిళా నేతలు సుగుణమ్మ, స్వాతి, పద్మమ్మ, వసంతమ్మ, తిరుమగళ్, గీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పొంగళ్లతో ముగిసిన శ్రీ పెద్దపల్లి గంగమాంబ జాతర

**కుప్పంరూరల్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** పట్టణం కొత్తపేటలో వెలసిన శ్రీ ప్రసన్న పెద్దపల్లి గంగమాంబ అమ్మవారి జాతర ఆదివారం అమ్మవారికి పొంగళ్ల సమర్పణతో ఘనంగా ముగిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయ ప్రాంగణంలో భక్తులు అమ్మవారికి పొంగళ్లు చేసి సమర్పించారు. ఆలయం వద్ద భక్తులకు ఆలయ ధర్మకర్త శివకుమార్, కార్యదర్శి వెంకటేష్ అన్నప్రసాదాలు అందించారు. శనివారం రాత్రి పచ్చిగెరిగ, అమ్మవారి అగ్నిగుండ ప్రవేశం, బాణవేడుకలు, పుష్పపల్లకి ఊరేగింపు కార్యక్రమాలు జరిగాయి. అమ్మవారికి శనివారం రాత్రి ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పట్టువ స్త్రాలు సమర్పించి దర్శించుకున్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామాల్లో జోరుగా చంద్రన్న జన్మదిన వేడుకలు



**కుప్పంరూరల్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** కుప్పం మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో సిఎం చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను తెదేపా నేతలు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా కేక్ కటింగ్, అన్నదాన కార్యక్రమాలు జరిపారు. గుడ్లనా యనపల్లి, కెడిపల్లి, నడిమూరు, వెండుగంపల్లి గ్రామాల్లో జన్మ దిన వేడుకలు జరిపారు. మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, కార్పోరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, నేత లు రామచంద్ర, ఆంజనేయరెడ్డి, ఉయ్యాల జయరాంరెడ్డి, సంతోష్, పార్థసారథి, మణి, అశోక్, నాగ రాజు, ఇఆర్‌బి బాలాజీ, మురళి పాల్గొన్నారు. అనంతరం తెదేపా సంస్థాగత ఎన్నికలను నిర్వహించారు.

## శాంతిపురంలో ఘనంగా సిఎం జన్మదిన వేడుకలు



**శాంతిపురం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** చంద్రబాబు జన్మదిన వేడుకలను శాంతిపురంలో తెదేపా నేతలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద, ఎన్టీఆర్ విగ్రహం వద్ద 75 కిలోల భారీ కేక్ కట్ చేశారు. అనంతరం అక్కడనుంచి ఎన్టీఆర్ సర్కిల్ దాకా ర్యాలీ చేపట్టారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆశాజ్యోతి సిఎం చంద్ర బాబునాయుడు అన్నారు. రాష్ట్రాభివృద్ధికి ప్రజల సంక్షేమానికి ఆయన నిరంతరం పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ్, మణి, ఎల్. జయరాంరెడ్డి, రమేష్, గోపాల్, చలపతి, బాలకృష్ణ, మురుగన్, రాజు, ఆంజనేయరెడ్డి, కోదండప్ప, రాధాకృష్ణ, నాగరాజు, వెంకటేష్, నారాయణ, రాజారెడ్డి, చంద్రారెడ్డి, బసవరాజు పాల్గొన్నారు. అలాగే రాళ్లబూదుగూరు, పలు గ్రామాల్లో సిఎం జన్మదిన వేడుకలను పార్టీ నేతలు, కార్యకర్తలు జరిపారు.

## అక్రమ మద్యం స్వాధీనం... వ్యక్తి అరెస్ట్

**కుప్పం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:**



ఎక్సైజ్ శాఖ చేసిన దాడుల్లో అక్రమ మద్యం కలిగి ఉన్న వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారని కుప్పం ఎక్సైజ్ సిఐ నాగరాజ తెలిపారు. శాంతిపురం మండలం అనికెర క్రాస్ వద్ద శీనప్ప అనే వ్యక్తిని అరెస్ట్ చేసి 56 కర్ణాటక, ఆంధ్ర మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈదాడుల్లో ఎస్సై దిలీప్, హెచ్‌సి కృష్ణమాచారి, కానిస్టేబుళ్లు వెంకటేష్, కళ్యాణ్‌కుమార్ పాల్గొన్నారు. ఎవరైనా అక్రమ మద్యం బెల్ట్‌షాపులు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## బాబు జన్మదిన వేడుకల్లో అన్నదానాలు



**శ్రీకాళహస్తిరూరల్,ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన సంద ర్భంగా ఆదివారం ఏర్పేడు మండలం గుడిమల్లం లోని పరశురామేశ్వరాలయానికి పలువురు అన్నదా నానికి విరాళాలు అందించారు. ఆలయంలో చంద్ర బా బుపేరిట అభిషేకాలు పూజలు జరిపించారు. ఆలయ మాజీ చైర్మెన్ బత్తల గిరినాయుడు అన్న దానానికి రూ.5116 విరాళం అందించారు. కాగా రమేష్ అంబిక రూ.5116 ఆలయ కార్యనిర్వహణాధికారి రామచంద్రారెడ్డికి అందించారు. ఈ మొత్తాలను అన్నదానానికి ఉపయోగించాలని కోరారు. వారికి ఆలయంలో వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

## విలువలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యం



**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** ఉన్నత విలువలతో కూడిన విద్యను అందించడమే తమ కళాశాల లక్ష్యమని విక్రమ్ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టన్ చంద్రశేఖర్, కరస్పాండెంట్ కె.మునిలక్ష్మి అన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో పట్టణంలో ప్రథమస్థానం సాధించిన విద్యార్ధులను ఆమె ఆదివారం కళాశాల ఆవరణలో మెమొంటోలు ఇచ్చి సత్కరించారు. ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో యం.పావని(988), వై.గుణవర్ధన్(988), పి.రాఘవ సాయి (983), బైపిసిలో ఎ.భువన్‌వెంకట్(960), సిఈసిలో ఆర్.మోహిత్ జైన్(945), ఎంఈసిలో ఎ.స్నేహజైన్(896)లను అభినందించి మెమొంటోలు ఇచ్చి సత్కరించారు. ఈసందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ తమ విద్యాసంస్థల్లో విలువలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యమని ఆమె వివరించారు. మొత్తం ద్వితీయ సంవత్సరం విద్యార్ధులు100మందికి పైగా 900పైన మార్కులు సాధించిన వారున్నారని, ప్రథమసంవ్సరంలో84 మంది 400పైగా మార్కులు సాధించామన్నారు. కార్యక్రమంలో విక్రమ్ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టన్ చంద్రశేఖర్ , కరస్పాండెంట్ కె.మునిలక్ష్మి , ప్రిన్సిపల్ మల్లికార్జున, కామర్స్ అధ్యాపకులు రామకృష్ణ, ఏఏ రామకృష్ణ మరియు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**తొట్టంబేడు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలు మండల పార్టీ అధ్యక్షులు గాలి మురళీనా యుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి రావిళ్ళ మునిరాజ నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం లోని శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు సింగమాలలో వెలసి ఉన్న వీరభద్రస్వామి ఆలయంలో మునిరాజనాయులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని వీరభద్రస్వామికి విశేష పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భారీకేక్‌ను కట్‌చేసి గ్రామస్తులకు, చిన్నారులకు పంపిణీచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధవి, గుర్రప్ప, జగదీశ్వరయ్య, సింగమాల సునీల్, చింతగింజలసునీల్, ఉన్నంగోవర్ధన్‌నాయుడు కమల్‌కుమార్, శేషమనాయుడు, వసంతనాయుడు, మోహన్‌నాయుడు, నాని, చంద్రకళ, గజలక్ష్మి, సుప్రియ తదితర నాయకులు పాల్గొన్నారు.

## కుంభాభిషేకానికి రూ.10వేలు విరాళం



**తొట్టంబేడు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** మండలంలోని పెద్దకనపర్తి గ్రామంలో సుమారు 75సంవత్సరాలుగా వెలసి ఉన్న శీతలాంబ ఆలయం ఉంది. అయితే ఈ ఆలయం శిధిలావస్థలకు చేరుకోవడంతో తిరిగి నూతన ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఈసందర్భంగా గ్రామంలో నిర్వహించే ఆలయ కుంభాభిషేకానికి శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి వినుత కోట ఆదివారం పట్టణ కార్యాలయంలో కలసి ఆమెను ఆహ్వానించారు. ఈసందర్భంగా శీతలాంబ ఆలయ కుంభాభిషేకానికి తన వంతు సాయంగా రూ.10వేలు వితరణ అందించారు.కార్యక్రమంలో కోట చంద్రబాబు, పలువురు పెద్దకనపర్తి గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆర్టీసి గ్యారేజీలో అగ్నిమాపక వారోత్సవాలు



**తొట్టంబేడు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా చివరిరోజు ఆర్టీసి గ్యారేజీ నందు కార్మికులకు కరపత్రాలు పంపిణీచేశారు. అయిల్ ఫైర్స్, గ్యాస్‌ఫైర్స్ మీద ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించి నపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ప్రయోగాత్మకంగా వివరించడంతో పాటు గ్యాస్‌ఫైర్ అయినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలును వివరించారు. వేసవి కాలంలో అప్రమత్తంగా ఉండాలని ఇన్‌ఛార్జి అగ్నిమాపకశాఖ అధికారి పి.నాగార్జునరెడ్డి వివరించారు. కార్యక్రమంలో ఎంఎఫ్ కళ్యాణ్ చక్రవర్తి అగ్నిమాపక సిబ్బంది ఎల్ఎఫ్.పి.తిరుమలరెడ్డి, ధనశేఖర్, అమర్నాధ్, పి.రంజిత్‌కుమార్, పి.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ అధ్యక్షునిచే సిఎం జన్మదిన వేడుకలు



**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** శాసనసభ్యులు బొజ్జలవెంకట సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణ టిడిపి కార్యాలయం నందు పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధి ప్రధాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75వ పుట్టినరోజు సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఎంఎల్ఏ బొజ్జల సుధీర్‌రెడ్డి చేతులమీదుగా భారీకేక్‌ను కట్‌చేశారు. అనంతరం సిఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీచేవారు. అనంతరం ఆస్పత్రి సమీపంలో ఉన్న అన్నా క్యాంటీన్ వద్ద పట్టణాధ్యక్షుడు విజయకుమార్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భాగంగా అన్నా క్యాంటీన్ వద్ద అన్నదాన కార్యక్రమంలో ఏర్పాటుచేసి సుమారు వెయ్యిమందికి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, మాజీ మార్కెట్‌కమిటీ ఛైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటా రమేష్, రావిళ్ళమునిరాజనాయుడు, మునిరాజ నాయుడు, ఆర్ముగంలతో పాట పలువురు తెలుగుదేశంపార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## నవ్యాంధ్ర నిర్మాత సీఎం జన్మదిన వేడుకలు



**బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** నవ్యాంధ్ర నిర్మాత తెలుగు ప్రజల ఆశాజ్యోతి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో తెలుగుదేశం నాయకులు కేక్ కట్‌చేసి పండుగల వైభవంగా జరుపుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో బస్టాండ్‌లో సీఎం చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను జరుపుకుని అన్నదానం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా టీడీపీ యువత కార్యదర్శి సముద్రాల రవినాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల శ్రేయస్సు అభివృద్ధి లక్ష్యంగా పని చేసే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశంమండల పార్టీ అధ్యక్షులు మామిళ్ళపల్లి సుధాకర్‌నాయుడు, జిల్లా తెలుగు యువత కార్యదర్శి సముద్రాల రవినాయుడు, మునిచంద్ర నాయుడు, మాజీ గ్రంథాలయ చైర్మన్ కన్నయ్య నాయుడు, మధు నాయుడు, బాలాజీనాయుడు, కార్తీక్ నాయుడు, కొండబాబు,మునెయ్యనాయుడు,వీర రాఘవులు, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విశ్రాంత సిజెఐ ఎన్‌వి రమణకు సాదర స్వాగతం



**తిరుమల,ఏప్రిల్ 20ప్రభాతవార్తప్రతినిధి:** సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ ఆదివారం రాత్రి తిరుమలకు వచ్చారు. పద్మావతి అతిథి గృహం వద్ద ఆయనకు రిసెప్షన్ డిప్యూటీ ఇఒ. పి.హరీంద్రనాథ్ సాదర స్వాగతం పలికారు. పుష్పగుచ్చం అందజేసి దుశ్శాలువ బహుకరించారు. రాత్రికి తిరుమలలో బసచేయనున్న జస్టిస్ రమణ సోమవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారు.

## గోశాలలో గోమాతలకు దాణా



తిరుపతి,ఏప్రిల్ 20ప్రభాతవార్త: ఎస్వీగోశాలలో గోమాతలకు టిడిపి నాయకులు దాణా తినిపించారు. సిఎం చంద్రబాబునాయుడు పుట్టినరోజు సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం గోశాలను టిడిపి నాయకులు సుగుణమ్మ, నరసింహ యాదవ్, వి.పుష్పావతియాదవ్, శ్రీధర్‌వర్మ, రవినాయుడు, కంకణాల రజినీకాంత్ నాయుడు సందర్శించారు. అక్కడ గోవుల ఆరోగ్యపరిస్థితి, గోసంరక్షణ, ఆహారం అందిస్తున్న తీరును గమనించారు. స్వయంగా గోవులకు దాణా పెట్టారు.

## మే 8,9 తేదీల్లో తుడ టవర్స్‌వాణిజ్య గదుల వేలం

**తిరుపతి కార్పొరేషన్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** తిరుపతి పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న తుడా టవర్స్ వాణిజ్య గదుల విక్రయాన్ని మే 8,9, తేదీల్లో ఈ వేలం నిర్వహించనున్నట్లు తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరములోని అన్నమయ్య కూడలి వద్ద 3.60 ఎకరముల స్థలములో జి ప్లస్ 13 అంతస్తులతో ప్రతిష్టాత్మకంగా తుడ టవర్స్ నిర్మిస్తున్న విషయం విదితమే. ఇందులోని నివాసయోగ్యమైన గదులకు వేలం నిర్వహించామని తెలిపారు. తుడ టవర్స్(గ్రౌండ్ ఫ్లోర్ (10 గదులు), మొదటి అంతస్తు (21 గదులు)లోని వాణిజ్య గదులను మే 8,9 తేదిల యందు ఈ వేలము ద్వారా అమ్ముటకు నిర్ణయించామని తెలిపారు. వాణిజ్యపు గదులు 2000 నుండి 9000 చదరపు అడుగుల విస్తీర్ణముతో నగర వాణిజ్య సముదాయములకు అత్యంత అనువైనదిగా నిర్మిస్తున్నామని తెలిపారు. వివరముల కొరకు తుడ కార్యాలయం, తుడ టవర్స్ వెబ్సైట్లు సంప్రదించవలసినదిగా ఉపాధ్యక్షులు ఆ ప్రకటనలో కోరారు.

## ట్రామా కేర్ సెంటర్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్



**తిరుపతిహెల్త్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** రమి గెస్ట్ లైన్ సమీపంలోని మంగళం రోడ్డు కరకంబాడి దగ్గర నూతన తిరుపతి ట్రామా కేర్ అండ్ఆస్పత్రిని బోర్డు సర్టిఫైడ్ సర్జన్, పిల్లల ఆర్థోపెడిక్ సర్జన్ వల్లేరి డాక్టర్ దుర్గా ప్రసాద్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ప్రారంభించారు. డాక్టర్ దుర్గా ప్రసాద్, ప్లాస్టిక్, కాస్మోటిక్ సర్జన్ వెల్లల డాక్టర్ సురేఖ ఇద్దరూ కోయంబత్తూరులోని ప్రఖ్యాత గంగా ఆస్పత్రిలో శిక్షణ పొందారు. ఈ ఆస్పత్రి ద్వారా 24 గంటలు అత్యవసర సేవలు, అన్ని రకాల సర్జరీలు, అత్యాధునిక సౌకర్యాలు అందిస్తున్న సేవలను డాక్టర్లను అడిగి తెలుసుకుని వైద్య సిబ్బందిని జిల్లా కలెక్టర్ అభినందించారు. ఇంకా మెరుగైన వైద్య సేవలు రోగులకు అందించాలని కలెక్టర్ తెలిపారు.

## ఉగాది పురస్కార గ్రహీతకు ఘన సన్మానం



**తిరుపతి హెల్త్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** రాష్ట్రం ప్రభుత్వం నుంచి ఇటీవల ఉగాది పురస్కారం అవార్డు అందుకున్న మైనా స్వామి పురుషోత్తం నాయుడును తిరుపతి ప్రెస్‌క్లబ్ కమిటి సభ్యులు ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రెస్‌క్లబ్ కోఆప్షన్ సభ్యులను తిరుపతి ప్రెస్‌క్లబ్ కమిటి శాలువ, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రమంలో నూతన ప్రెస్‌క్లబ్ కమిటి నేతలు, మాజీ ప్రెస్‌క్లబ్ కమిటి నేతలు, జర్నలిస్టులు ప్రెస్‌క్లబ్ కమిటి మెంబరు జయశంకర్ పాల్గొన్నారు.

## ఆధునిక కాలానికి సంస్కృతం అవసరం



**తిరుపతి విద్య, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** ఆధునిక కాలానికి సంస్కృత ఎంతో అవసరమని, భాష ఆవశ్యకతను భవిష్యత్తు తరాలకు పెద్ద ఎత్తున తెలియ జేయాల్సి న అవసరం ఉందని అఖిల భారతీయ సంఘ కార్యవాహ్ సురేష్ సోని అభిప్రాయపడ్డారు. జాతీయ సంస్కృత వర్సిటీ,సంస్కృత భారతి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించన స్ఫూర్తి సంఘమం కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగావిచ్చేసి సంస్కృ భాష ఆవశ్యకత, ఆధునిక కాలంలో సంస్కృతం భారతీయ సభ్య సమాజానికి ఒక మంచి మార్గాన్ని నిర్దేశించే దిక్సూచిగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో సంస్కృత భారతి అఖిల భారతీయ అధ్యక్షులు ప్రొఫెసర్ గోపబంధు మిశ్రా, కేంద్రియ సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీవాస వార్కేడి, డాక్టర్ ఎంజీ నందన్రావు, డాక్టర్ ఎస్ఎల్ సీతారాం శర్మ, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## కషీస్ 'జైన దీక్ష' స్వీకరణ



**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తిలో జైన మతానికి చెందిన యువతి 'జైన్ దీక్ష' స్వీకరణ కార్యక్రమాలు భారీ ఎత్తున సంబరాలు ఏర్పాటు చేసారు. ఆది వారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నాలుగు మాడావీధుల్లో జైన్ మహిళలు నాట్యాలు చేస్తూ ఊరేగింపు జరిపారు.ఎస్వియస్‌జైన్ శ్రావక్ సంఘ సారధ్యంలో సంబరాలు ఏర్పాటు చేసారు. పట్టణంలోని జైన మతస్థులు తమ వ్యాపారాలను మూసివేసి సంబరాల్లో భాగస్వామ్యం అయ్యారు. శ్రీకాళహస్తిలో పేరు ప్రఖ్యాతులు గాంచిన సునీల్‌జైన్ మొదటి కుమార్తె కషేస్ సంసారిక జీవితం నుంచి ఆధ్యాత్మిక జీవితాన్ని ఎంచుకున్న సందర్భంగా మే 3న జైన్ దీక్ష ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. దీక్ష చేసుకునే కషేస్‌ను గుర్రపు బండిని ఏర్పాటు చేసారు. భారీ ఎత్తున మేళ తాళాలతో మహిళలు, పురుషులు నాట్యాలు చేసుకుంటూ సాగారు.పట్టణంలో చల్లని పానీయాలు పంపిణి చేస్తూ ముందుకు సాగారు.

## దేవాంగ సంఘంచే పంచాంగం ఆవిష్కరణ



**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** ఎపి రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం ప్రతినిధులచే బండారు వారి సౌజన్యంతో 39వ తెలుగు విశ్వసు తెలుగు పంచాంగాన్ని ఆది వారం ఆవిష్కరించారు.తిరుపతి జిల్లా వరదయ్యపాళెం ఆర్ ఆర్ ఫంక్షన్ హాల్లో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. బాపట్ల జిల్లా వేటపాళెం మండలం పందిళ్ళపల్లి గ్రామానికి చెందిన వాస్తవ్యులు బండారు పిచ్చయ్య, శారదాంబ జ్ఞాపకార్థం వారి కుమారులు వైష్ణో వస్త్ర వ్యాపారస్తులు బండారు మోహనరావు, బండారు బ్రహ్మంల సహకారంతో తెలుగు సంవత్సరాది పంచాంగాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమాల్లో ప్రధాన కార్యదర్శి నక్కిన చిన వెంకటరాయుడు, రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు వూటుకూరి సుబ్రమణ్యం శర్మస్వామి ఎఐడబ్లుఎఫ్ జాతీయ అధ్యక్షులు బండారు అనంద్ ప్రసాధ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మాడిశెట్టి శివశంకరయ్య ఉపాధ్యక్షులు కర్ణచంద్రశేఖర్,కార్యదర్శులు అల్లంకి నాగేశ్వరరావు,రాష్ట్రనాయకులుబూసంరాజశేఖర్,పెన్నెం రవి బులసల వవెంకటసుబ్బారావు పాల్గొన్నారు.

## సభ్యుల అభివృద్దే అసోసియేషన్ ధ్యేయం



**తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** టూవీలర్స్ మెకానిక్స్, వారి కుటుంబ సభ్యుల అభివృద్దే తిరుపతి జిల్లా టూవీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ ధ్యేయం అని ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆవుల మునిరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక గాంధీభవన్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తగా మార్కెట్‌లోకి వస్తున్న కొత్త టూవీలర్స్ వాహనాల పనితీరు, రిపేర్లపై టూవీలర్స్ మెకానిక్స్ ఆవుల మునిరెడ్డి ఆధ్వర్యంలో టీవీఎస్‌ఎం పీజీఎం ట్రైనర్ మజురిద్దీన్, కెశ్విన్ సర్వీస్ జీఎం మోహన్ కుమార్, ఏడీ మేనేజర్ వేణుగోపాల్ ద్వారా తగు సూచనలు. సలహాలను అందజేశారు. టూవీలర్స్ మెకానిక్స్, వారి కుటుంబ సభ్యుల ఆర్థికాభివృద్ధి అసోసియేషన్ చేస్తున్న కృషిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు, సభ్యులు, మెకానిక్స్ పాల్గొన్నారు.

## సిమెంటు రోడ్డు ప్రారంభం



**సత్యవేడు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** సత్యవేడు మండలం రాజగోపాలపురంలో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంటు రోడ్డును తెలుగుదేశం పార్టీ సత్యవేడు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ శ్రీపతిబాబు, పరిశీలకులు చంద్రశేఖర్ నాయుడు, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రగతి సూర్యుడు సీఎం చంద్రబాబునాయుడుకు ఆర్థిక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సత్యవేడు టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించి తెలుగు తమ్ముళ్లు



**సత్యవేడు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** సత్యవేడు పట్టణంలోని శ్రీకాళహస్తి బస్టాండ్ వద్ద టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిశీలకులు చంద్రశేఖర్ నాయుడు, సమన్వయకర్త శ్రీపతిబాబు చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. వేసవి తీవ్రత అధికమైన నేపథ్యంలో పార్టీ మండల అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డిచలివేంద్రం ఏర్పాటుపై దృష్టి సారించారు. ఇందులో భాగంగానే శ్రీకాళహస్తి బస్టాండ్ వద్ద ఫ్రిడ్జితో పాటు మినరల్ వాటర్‌ని ఏర్పాటు చేశారు. ఇక్కడ బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు, పాదచారులకు గొంతు తడపడానికి సురక్షితమైన తాగునీటిని అందించాలన్న ఉద్దేశంతో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మాజీ ఎంపీపీ మస్తాన్, బాలరాజు, దాము రాజు, హేమభూషణం, షణ్ముగం, సురేంద్ర, ప్రభాకర్‌రెడ్డి, గుర్రప్ప, జనసేన మండల అధ్యక్షుడు రూపేష్ కుమార్ పాల్గొన్నారు.

## అధినేత జన్మదిన వేడుకల్లో విచిత్రం



**సత్యవేడు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా సత్యవేడు పట్టణంలో నిర్వహించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకల్లో పార్టీ నేతలు మూడు ముక్క లాటగా నిర్వహించడం జరిగింది. ఆదివారం పట్టణంలో పలు చోట్ల చంద్రబాబు జన్మదిన వేడుకలను మూడు ముక్కలన్నట్టు పార్టీ నేతలు జరుపుకోవడంపై సత్యవేడులో చర్చనియాంశంగా మారింది. పార్టీ కార్యక్రమాలు ఏదైనా సరే పార్టీ శ్రేణులు అందరూ కలసి జరుపుకోవాల్సింది పోయి వర్గాలుగా విడిపోయి కార్యక్రమాలు నిర్వహించడం పట్ల కార్యకర్తల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇందులో భాగంగానే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు సైతం మూడు వర్గాలుగా విడిపోయి జరుపుకోవడంపై విమర్శలు లేకపోలేదు. ఈ నేపథ్యంలో తొలుత పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద మండల టీడీపీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు చంద్రశేఖర్ నాయుడు, సమన్వయకర్త శ్రీపతిబాబు ముఖ్య అతిథులుగా విచ్చేయగా చంద్రబాబు జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఇదే తరహాలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద మరో వర్గం చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను నిర్వహించారు. టీడీపీ నాయకులు శివయ్య, నరేంద్ర,శివకుమార్, గోవింద చౌదరి, పామాంజి వాసు, పృథ్వి, జడేరి బాబు, ఈశ్వరయ్య, భూపాలనాయుడు, కోనయ్య, దిలీప్, శోభ, లోకయ్యరెడ్డి తదితరులు కేక్ కట్ చేసి పుర ప్రజలకు పంచి పెట్టారు. పైగా చంద్రబాబు జన్మదిన వేడుకలు నేపథ్యంలో అన్నదానం చేశారు. అయితే గాంధీ విగ్రహం వద్ద పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన చంద్రబాబు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కొందరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద జరిగిన బాబు జన్మదిన వేడుకలకు హాజరయ్యారు. ఇక మూడో వర్గం పట్టణంలోనే గాంధీ విగ్రహం వద్ద చంద్రబాబు జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఇక్కడ కూడా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బాల, మురళి(చికెన్ చిన్న) లోకయ్యరెడ్డి, అంబేద్కర్ వెల్ఫేర్ అసోసియేషన్అధ్యక్షులు రమణ, శివానందం, గణేష్, ధనశేఖర్, జడేరి బాబు, జనసేన నాయకుడు బాల మురళీకృష్ణ, బండారు మోహన్‌బాబు తదితరులు చంద్రబాబు జన్మదిన వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసి బాబు జన్మదిన సంబరాలను జరుపుకున్నారు. ఇలా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను సత్యవేడులో మూడు వర్గాలు వేరు వేరుగా నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది.

## విద్యార్థులకు దుస్తులు వితరణ



**వడమాలపేట, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** మండలంలోని సీతారామపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నాగరాజు తన బడిలోని విద్యార్థులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేసి ఆదర్శంగా నిలిచారు. ఆదివారం ఉదయం పాఠశాలలో వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలల్లోని 11 మంది పిల్లలకు ఉపాధ్యాయుడు తన సొంత డబ్బులతో ప్యాంటు, షర్టులను తీసుకొచ్చి ఎస్ఎంసీ చైర్మన్ మమత చేతుల మీదుగా అందజేశారు. గ్రామస్తులు గోపాల్‌నాయుడు, మోహన్ నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడుల సారథ్యంలో ఉపాధ్యాయుడు నాగరాజు పరాంకుశ కుటుంబం పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయుడు నాగరాజును గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు. కనికరాజు, హరినాథ్, రవికుమార్, అంగన్‌వాడీ వర్కర్ తరుణశ్రీ, సిబ్బంది మంజులమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు



**విజయపురం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** మండలంలోని ఇళ్ళత్తూరులో ఆదివారం సీఎం చంద్రబాబు నాయుడుజన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కేక్ కట్ చేసి సీఎం జన్మదినాన్ని కొనియాడారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండలటీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబు యాదవ్, నాయకులు లక్ష్మిపతిరాజు, మునిభాస్కర్‌రాజు, హరికృష్ణ, వరదరాజులు, ఏళుమలై, నాగభూషణం యాదవ్, రవిరాజు, సుబ్రహ్మణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు.

## కనకదుర్గమ్మ సేవలో ఎమ్మెల్యే భాను



**విజయపురం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన విజయపురం మిట్టూరులో ఆదివారం కనకదుర్గమ్మ తిరుణాళ్ళ ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కనకదుర్గమ్మ సేవలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందించి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనంజయ యాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు మురళి తదితరులు పాల్గొన్నారు.

## గొప్ప విజనరీ ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడు



**రేణిగుంట ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గొప్ప విజనరీ ఉన్న నాయకుడని టిడిపి నేతలు ఆయనను పొగడ్తలతో ముంచెత్తారు. చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలు రేణిగుంట ఎన్టీఆర్ సర్కిల్ టిడిపి నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. కొంతమంది టిడిపి నేతలు రేణిగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో చంద్రబాబు నాయుడు పేర పూజలు జరిపారు. ఈ సందర్భంగా రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబ్ బాషా మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు హైదరాబాదు నగరాన్ని అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో రేణిగుంట మండల టిడిపి అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, మాజీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, రేణిగుంట టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ డి పుష్పనాదం, జిల్లా టిడిపి నాయకులు మునిస్వామి నాయుడు, పార్టీ సీనియర్ నేతలు నవాబు, సూరిబాబు, అన్నాసంపల్లి భాస్కర్ రెడ్డి, అంబి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎపిలో చంద్రబాబు పుట్టడం ఓ వరం



...రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పుట్టడం ...మాజీ చేర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి తెలిపారు.అదివారం ...డు 75వ జన్మదిన వేడుకలు టిడిపి నాయకులు, ...అధ్యక్షులు పేరం వెంకటేశ్వరరావు ఆద్వర్యంలో కేక్ కట్ ...ంగా ఆయన మాట్లాడుతూ నాలుగు పర్యాయాలు ముఖ్యమంత్రిగా, తొమ్మిది సార్లు ఎమ్మెల్యేగా,మంత్రిగా విజనరీ వున్న నాయకుడుగా రాష్ట్రంలోని పేద,మధ్య తరగతి కుటుంబాల వారిని ఆదుకున్న నాయకుడుగా అన్ని వర్గాల ప్రజలను ఆదుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవినాయుడు, రెడ్డివారి భాస్కర్‌రెడ్డి, బాబుయాదవ్, రమేష్‌నాయుడు, చిట్టిబాబు నాయుడు, తంగరాజన్, రాము, మురళీనాయుడు, మనోజ్, జగన్, మనోహార్ నాయుడు,వెంకటరత్నంనాయుడు,సంపూర్ణమ్మ,క్రిష్ణయ్య,తదితరలు పాల్గోన్నారు.

## కేవీబీ పురంలో సీఎం జన్మదిన వేడుకలు



**కేవీబీ పురం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** మండలంలోని కేవీబీ పురంలో ఆదివారం సీఎం చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొని సీఎం చంద్రబాబు నాయుడు జన్మదిన కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు, బీజేపీ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## సిఎం చంద్రబాబు పేరున

### అభిమాని 750కొబ్బరికాయల మొక్కులు



**తిరుమల,ఏప్రిల్ 20ప్రభాతవార్తప్రతినిధి::** సిఎం చంద్రబాబునాయుడుకు ఆయురారోగ్యాలు, శక్తిని ప్రసాదించాలని పార్టీ నాయకులు శ్రీవేంకటేశ్వర స్వామిని వేడుకున్నారు. చంద్రబాబునాయుడు 75వ పుట్టినరోజు సందర్భంగా టిడిపి రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బి.శ్రీధర్‌వర్మ, తిరుమల టిడిపి నాయకులు రాజుయాదవ్,వెంకీరాయల్, మధు,కుమార్ తదితరులతో కలిసి ఆదివారం ఉదయం అఖిలాండం వద్ద 7.5కిలోల కర్పూరం వెలిగించి, 750 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

## శ్రీవారి సేవలో ఎమ్మెల్యే అమర్



**తిరుమల,ఏప్రిల్ 20 ప్రభాతవార్తప్రతినిధి:** పలమనేరు ఎంఎల్ఎ అమరనాథరెడ్డి ఆదివారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## మిస్టర్ గోల్డెన్ ఓపెన్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్ ప్రారంభం.




**తిరుపతి విద్య, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** మిస్టర్ గోల్డెన్ తమిళనాడు ఓపెన్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ ఆదివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆల్ ఇండియా గోల్డెన్ బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ విచ్చేసి పోటీల్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణజాస్ ఇంటర్నేషనల్ ఈ పోటీల్ని స్పాన్సర్ చేయడం చాలా సంతోషమని మెన్స్ బాడీ బిల్డింగ్ ఉమెన్స్ బాడీ బిల్డింగ్ మెన్స్ క్లాసిక్ ఫిజిక్ మెన్స్ ఫిజిక్ మోడలింగ్ మెన్ మోడలింగ్ విమెన్‌తో పాటు 55 కేజీల కేటగిరి 60 కేజీల కేటగిరి 65 కేజీలు కేటగిరి 70 కేజీల కేటగిరి 75 కేజీల కేటగిరి 80 కేజీల కేటగిరి 85 కేజీలు కేటగిరి 90 కేజీలు కేటగిరి 90 పైబడిన కేటగిరి లకు బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించారు.అనంతరం ప్రనోజాస్ ప్రోడక్ట్‌ని ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో గోల్డెన్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి జి వి బాబు,మాజీ మిస్టర్ ఇండియా మునియప్పన్, కోశాధికారి దినేష్ కుమార్,కే సురేష్, అనూజ్ సోనీ,నిశర్బాన్, సత్యం బిజీ బాబు, అఖిల్ బాబు, గౌరీ శంకర్, ఆర్ బి సురేష్ బాబు, ఆర్ షణ్ముగం, దినేష్ కుమార్, లక్ష్మీ పాల్గొన్నారు.

## పేదలకు అంబులెన్స్ సేవలు ప్రశంసనీయం



**తిరుపతి విద్య, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** ప్రణీత్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రణీత్ పెనుమాడు ఆధ్వర్యంలో నిరుపేదలకు ఉచితంగా అందిస్తున్న మార్చురీ అంబులెన్స్ సేవలు ప్రశంసనీయమని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తెలిపారు. మాజీ ఉపరాష్ట్రపతి, స్వర్ణ భారత్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ముప్పవరపు వెంకయ్య నాయుడును వారి కార్యాలయంలో ఎడిఫై స్కూల్ డైరెక్టర్ ప్రణీత్ పుష్పగుచ్ఛాన్ని అందించి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎడిఫై స్కూల్ అందిస్తున్న కార్యాపాల గురించి అడిగి తెలుసుకున్నారు.ప్రణీత్ ఫౌండేషన్ స్థాపించి ఎంతోమంది పేదలకు అండగా నిలవడం అభినందనీయమని కొనియాడారు.భవిష్యత్తులో ప్రణీత్ ఫౌండేషన్ ద్వారా పేద ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ప్రోత్సహించారు.ప్రణీత్ ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు.

## జేఈఈ మెయిన్స్ ఫలితాలలో సంస్కృతి ప్రభంజనం..



**తిరుపతి విద్య, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** తిరుచానూరులోని సంస్కృతి కళాశాల విద్యార్థులు జేఈఈ 2025 మెయిన్స్ ఫలితాలలో ప్రభంజనం సృష్టించారని ఆ విద్యా సంస్థల డైరెక్టర్ ప్రణీత్ పెనుమాడు తెలిపారు.శనివారం విడుదలైన ఫలితాలలో డి.జగదీశ్‌రెడ్డి 99.80 పర్సంటైల్,బి.తేజేష్ 99.29 పర్సంటైల్, బి.గిరీష్‌రెడ్డి 99.02 పర్సంటైల్ సాధించగా ముప్పై మంది విద్యార్థులు జెఈఈ అడ్వాన్స్‌కి అర్హత సాధించారన్నారు. ఇంతటి అద్భుతమైన ఫలితాలు సాధించిన విద్యార్థులను,వారి తల్లిదండ్రులను, అందుకు కృషి చేసిన అధ్యాప కబృందానికి సంస్కృతి విద్యాసంస్థల చైర్‌పర్సన్ పి.సులోచన, డైరెక్టర్ ప్రణీత్ అభినందించారు.

## ఎమ్మెల్యే కోనేటిచే సిఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు



**నారాయణవనం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా నారాయణవనం దూండి వినాయకుని ఆలయం వద్ద ఘనంగా జరిగింది. దూండి వినాయకుని ఆలయంలో సిఎం చంద్రబాబు పేరుతో అర్చన చేసిన తర్వాత సిఎం చిత్రపటాన్ని ఏర్పాటు చేసి కేక్ కట్ చేశారు. అంతకుముందు సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జడ్పీ ఫైనాన్స్ కమిటీ అధ్యక్షులు కోనేటి సుమన్‌కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశం మెచ్చిన రాజకీయ నాయకులు, ఉత్తమ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ని సిఎంగా వున్న సమయంలో ఆయన చేసిన అభివృద్ధి, సంక్షేమం నేటికి గుర్తుందన్నారు. మండల టిడిపి మాజీ అధ్యక్షులు ఎన్ భాస్కరన్ ఆధ్వర్యంలో సిఎం జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. అరణ్యంకండ్రిగ, తుంబూరులో రాజశేఖర్‌యాదవ్, పురుషోత్తం, నరేష్‌కుమార్ ఆచ్చారి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నారాయణవనం తర్వాత పిచ్చాటూరు, నాగలాపురం, కెవిబిపురం, సత్యవేడు, వరదయ్యపాలెం, బుచ్చి నాయుడు కండ్రిగలో జరిగిన సిఎం చంద్రబాబు పుట్టిన రోజుల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపిలు పి గోవిందస్వామి, ఎపి భక్తవత్సలం, మాజీ సర్పంచ్‌లు కెఎస్‌రవి, సుధాబాబు, టిడిపి నాయకులు కెఎస్.రవి, గాండ్ల శివకుమార్, శ్రీనివాసయాదవ్, ఎన్.కందస్వామినాయుడు, అడుసుమల్లి జయ చంద్ర నాయుడు, బాలచంద్రనాయుడు, శంకరయ్య, టి ఊరప్ప, రమేష్, సుధా బాబు, కూల్‌డ్రింక్స్ రమేష్, ఎ.హరి, మాణిక్యంరెడ్డి, వేలురెడ్డి, శరవణరెడ్డి, దొరవేలురెడ్డి, గాండ్ల గోవింశెట్టి, బాలయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయండి : ఎంపిడిఓకు వినతి



**నారాయణవనం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** మండలంలోని కీళగరం ప్రాధమి కోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అఫ్‌గ్రేడ్ చేయాలని కీళగరంకు చెందిన పలువురు విద్యార్థుల తల్లితండ్రులు ఇన్‌చార్జీ ఎంపిడిఓ గుణశేఖర్‌కి వినతిపత్రం అందించారు. ఈ పాఠశాలను స్థాపించి సుమారు 70సంవత్సరాలు పూర్తయిందన్నారు. ముందుగా ప్రాథమిక పాఠశాలగా వున్న ఆ తర్వాత యుపి స్కూల్‌గా అఫ్‌గ్రేడ్ చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం 1నుంచి5 వరకు 79మంది, 6నుంచి8 తరగతుల వరకు మరో 79మంది విద్యార్థులు వున్నట్టు చెప్పారు. ప్రస్తుతం పిల్లల నమోదు శాతం తగ్గకుండా అధ్యాపకులు, పిల్లల తల్లితండ్రులు జాగ్రత్తగా కాపాడుకోవడం జరుగుతుందన్నారు. ద్రీనిపై స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కూడా అనుకూలంగా ప్రతిపాదించారన్నారు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

## 22న మండల మీట్ : ఇన్‌చార్జ్ ఎంపిడిఓ

**నారాయణవనం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** ఈ నెల 22వతేది మంగళవారం ఉదయం 10గంటలకు నారాయణవనం మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఇన్‌చార్జీ ఎంపిడిఓ గుణశేఖర్ తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిథులు అందరు పాల్గొనాలని కోరారు.

## ఘనంగా చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు



**పాకాల, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** మండలంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని సూచనల మేరకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా ఘనంగా జన్మదినం వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. తదుపరి అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, ఎన్ డి ఏ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద పాల్గొన్నారు.

## పశువైద్య శిబిరంలో గర్భకోశ పరీక్షలు

**చంద్రగిరి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వ విద్యాలయంలో పశువైద్య కళాశాలలో ఫైనల్ ఇయర్ విద్యార్థులు తొండవాడలో జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) మూడవ రోజున ఉచిత పశు వైద్య శిబిరంలో పాడిఆవులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. ఆదివారం పశువైద్య కళాశాలకు చెందిన అంబులేటరీ క్లినిక్ తొండవాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి రిటైర్డ్ అధ్యాపకులు డాక్టర్ జె.సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ సేవా ధృక్పథంతో మీరు చేసే పనులు ఏదో ఒక దశలో తిరిగి ప్రతిఫలం పొందగలరన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామకమిటీ అధ్యక్షుడు ఉమాపతి రెడ్డి, టిడిపి నాయకులు పులికంటి మోహన్ రెడ్డి, జగన్మోహన్ నాయుడు, శంకర్ యాదవ్, అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య, అధ్యాపకులు డాక్టర్ వైకుంఠరావు, పశువైద్యాధికారి డాక్టర్ కీర్తి, రాజా, వెంకటేశ్వర్లు, శ్రీనివాస రావు, అమరావతి, గుణరంజన్, పాడి రైతులు పాల్గొన్నారు.

# రాష్ట్రాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న సీఎం : ఎమ్మెల్యే



గూడూరు, ఏరపిల్ 20 ప్రభాతవార్త: రాష్ట్ర అభివృద్ధి కొరకు పేదరికాన్ని రూపుమాపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం శ్రమిస్తున్నారని భగవంతుడి ఆశీస్సులతో ఆయన ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి పుట్టినరోజు సందర్భంగా గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేకును ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ కట్ చేసి నాయకుల అందరికీ అందించారు. ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కొరకు చంద్రబాబు నాయుడు నిరంతరం శ్రమిస్తున్నారని ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకువచ్చి పేదరికం రూపుమాపుతున్నారని అన్నారు. నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు అనేక పరిశ్రమలు తీసుకువస్తున్నారని రాబోయే రోజుల్లో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం కిరణ్ కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, రహీం, నరసింహులు, వెంకటేశ్వర్‌రెడ్డి, లీలావతి, మట్టం శ్రావణి, శ్రీదేవి, భారతి, కల్పన, సుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం



బాలాయపల్లి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త: సీఎం నారా చంద్రబాబు నాయుడు తోనే అభివృద్ధి సాధ్యమని మండల పార్టీ అధ్యక్షులు రాయి మస్తాన్‌నాయుడు తెలిపారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి జాతీయ అధ్యక్షులు, నవ్యాంధ్ర సృష్టికర్త ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను మండల పార్టీ అధ్యక్షుడు రావి మస్తాన్ నాయుడు, టిడిపి నేతలు జడపల్లి కోటేశ్వర గౌడ్, క్లస్టర్ ఇంచార్జి రావి సత్యంనాయుడు, కే.రామచంద్ర నాయుడు, టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా శరవేగంగా సీఎం ముందుకు తీసుకువెళుతున్నారు. ఈ వేడుకల్లో టిడిపి నేతలు కె. రామచంద్ర నాయుడు, మద్దూరు కృష్ణ, సాగి నరసింహులు నాయుడు, దాసరి రాజగోపాల్ నాయుడు, జడపల్లి కోటేశ్వర గౌడ్, వెంకటేశ్వర నాయుడు, తాళ్లూరు ప్రసాద్ నాయుడు, రావి సత్యం నాయుడు, బిల్లు సిసింద్రీ యాదవ్, కోటి, కృష్ణారెడ్డి, గోపాల్ యాదవ్, చిత్తూరు ఈశ్వరయ్య, దామ మధు నాయుడు, సుందర సాయి, రఘురాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విజన్ ఉన్న నాయకుడు సీఎం చంద్రబాబు



వెంకటగిరి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త : సీఎం చంద్రబాబు నాయుడు యూజన్ కలిగిన నాయకుడని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు తెలిపారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు జన్మదిన సందర్భంగా వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి, బాలసదనలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. పోలేరమ్మగుడి వద్ద సీఎం 75వ జన్మదిన సందర్భంగా 75 కొబ్బరికాయలను కొట్టి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తనుజరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు చంద్రమోళిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బిరం రాజేశ్వరరావు, నాయకులు విశ్వనాథం, సత్యనారాయణ, మల్లారం బాబు, జనసేన నాయకులు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బలిజ కాపు ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు



వెంకటగిరి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త: శ్రీకృష్ణదేవ రాయ బలిజ కాపు తెలగ ట్రస్ట్ ద్వారా విధిగా సేవా కార్యక్రమాలు చేపడుతు న్నట్లు ట్రస్ట్ చైర్మన్ తోట కృష్ణయ్య శ్రీకృష్ణదేవరాయ బలిజ కాపు ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానం వద్ద సభ్యులు శ్రీ గొల్లగుంట రాము సౌజన్యంతో మజ్జిగ చలివేంద్ర కార్యక్రమము జరిగినది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు అభిమానులు కోన వెంకటేశ్వరరావు, కుసుమ రమేష్, గొల్లగుంట వెంకటముని, రామారావు, అనిల్ కందాల, తిరుపాలు, పసుపులేటి తులసీదాస్, మల్లు రవీంద్ర, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## కార్డ్ అండ్ సెర్చ్‌లో ఐదు ఆటోలు సీజ్ : సీఐ



వెంకటగిరి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త : పట్టణంలోని జగనన్న కాలనీలో కార్డ్ అండ్ సర్చ్ నిర్వహించి ఐదు ఆటలు, 11 ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. ఈ కాలనీలో గంజాయి, తదితర అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహించినట్లు సీఐ ఏవి రమణ తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు కామినేని గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

## జైన్ సంఘుచే ఉచిత కంటి వైద్య శిబిరం



గూడూరు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త: పట్టణంలోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్లో జైన్ సంఘ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిం చారు. పట్టణ చుట్టుపక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు వచ్చి కంటి పరీక్షల నిర్వహిం చుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించనున్నారు. జైన్ సంఘ సభ్యులు అశోక్ మాట్లాడుతూ సంఘం తరఫున ప్రతి సంవత్సరం ఐ క్యాంపులు నిర్వహిస్తున్నామని ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తు న్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మీచంద్, అశోక్ కుమార్, అభిషేక్ కుమార్, సతీష్, రమేష్, అరుణ్, సుభాష్, నితీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు



కోట, ఏప్రిల్ 20 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలను కోట, విద్యానగర్‌లలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ముందుగా జిల్లా తెలుగు దేశం పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్ భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా జలీల్ అహ్మద్ మాట్లాడుతూ అనితర సాధ్యుడు చంద్రబాబుకు వజ్రోత్సవ జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. రాష్ట్ర ప్రగతిని పునరుజ్జీవింపచేయడం ఆయన వంటి దార్శనికుడికే సాధ్యమన్నారు. చంద్రబాబు విజన్, నిరంతరం పనిలో చూపే ఉత్సాహం అద్భుతం, భవిష్యత్ అంచనా వేసి వ్యవస్థలను నడిపించే విధానం స్ఫూర్తిదాయకమన్నారు. ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కోటలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పలగాటి భాస్కర్‌రెడ్డి, నెల్లూరు మోహన్‌రెడ్డి, మధుయాదవ్, పోలయ్య, జితేంద్రరెడ్డి, తన్నమాల కోటారెడ్డి, వాకా విజయభాస్కర్‌రెడ్డి, మస్తాన్‌బాషా, కోటేశ్వరరెడ్డి, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



కోట, ఏప్రిల్ 20 ప్రభాతవార్త: మండలంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు ప్రభుత్వాసుపత్రిలో, ఆర్టీసీ బస్టాం డులో, అపార్టుమెంట్లలో జరిగాయి. ముగింపు సందర్భంగా ఆదివారం స్థానిక అగ్నిమాపక కార్యాలయంలో ఈ వారం రోజుల పాటు అగ్ని ప్రమాదాల నివారణపై జరిగిన కార్యక్రమాలను అగ్నిమాపకశాఖ అధికారి హరీష్ వివరించారు. జిల్లా పరిషత్ బాలికలకు పూర్తిస్థాయిలో అగ్ని ప్రమాదాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో వినయ్, సిద్దిక్, నాగరాజు, నరసింహం, సుబ్బయ్య, శ్రీహరి, దుర్గాప్రసాద్, సునీల్, దశయ్య తదితరులు పాల్గొన్నారు.

## శివాలయంలో స్వామివారి కల్యాణం



తడ, ఏప్రిల్ 20 ప్రభాతవార్త: మండలం తడకండ్రిగ పంచాయతీ పరిధిలోని బోడిలింగాలపాడులో వెలసిన శ్రీ భువనేశ్వరీ సమేత భువనేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇటీవల జీర్ణోద్ధరణ పనులు చేసుకున్న ఈ ఆలయంలో స్వామి అమ్మవార్ల కల్యాణానికి తడతో పాటు పరిసర గ్రామాల ప్రజలు హాజరై భక్తిశ్రద్ధలతో వీక్షించారు. సూళ్లూరుపేటకు చెందిన తిరుమూరు సుధాకర్‌రెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. తడకండ్రిగ గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాణిపాకం ఆలయంలో సీఎం జన్మదిన వేడుకలు





కాణిపాకం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలను ఆదివారం కాణిపాకం ఆలయంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి, కమీషనర్‌ల ఆదేశాల మేరకు చంద్రబాబు 75వ జన్మదిన వేడుకలను స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, ఆలయ ఈఓ పెంచల కిషోర్‌ల ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. ఈసందర్భంగా ఆలయంలో చంద్రబాబు పేరిట స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. అలాగే రాష్ట్రప్రభుత్వం, దేవాదాయశాఖల ఆధ్వర్యంలో వేదం పూర్తి చేసుకుని నిరుద్యోగులుగా వున్న 40 మందికి నిరుద్యోగి భృతిగా నెలకు మూడు వేల రూపాయలు వంతున ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, ఆలయ ఈఓ పెంచల కిషోర్‌ల చేతుల మీదుగా అందజేశారు. అలాగే ఐరాల జడ్పీటీసీ సుచిత్ర కన్నయ్యానాయుడు దాతగా చంద్రబాబు పేరున 1,01,320 రూపాయలు చెల్లించి అన్నదాన భవన్‌లో భక్తులకు ఒక రోజు అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెడెంట్‌లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజీనాయుడు, ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మదుసూధన్‌రావు, ఐరాల జడ్పీటీసీ సుచిత్ర కన్నయ్యానాయుడు, మాజీ జడ్పీటీసీ ఎం.లత, మండల పార్టీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, స్థానిక నాయకులు హేమాద్రినాయుడు, చిన్ని, పూర్ణచంద్రరావు లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు, దివ్యాంగులకు బట్టల పంపిణీ





శ్రీకాళహస్తి,ఏప్రిల్ 20 ప్రభాతవార్త : పుణ్యక్షేత్రంలో ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సారధ్యంలో నిర్వహించారు. ఉదయం శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో చంద్రబాబునాయుడు పేర అభిషేకాలు జరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైనమిక్ నాయకుడు చంద్రబాబు నాయుడు కింగ్‌మేకర్ అని రాష్ట్ర కోసం జాతీయ స్థాయి పదవులను సైతం స్వీకరించని జన్మభూమిని మరువని నాయకుడు అన్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద మహిళా సెక్యూరిటీ,పారిశుద్ధ్య కార్మికులకు బొజ్జల బృందమ్మ సారధ్యంలో చీరలు పంపిణీ చేసారు. కాగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయ కుమార్ నాయుడు సారధ్యంలో సామాజిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆసుపత్రిలో రోగులకు పాలు పండ్లు పంపిణి చేసారు. తిరుపతి పార్లమెంటు ఎస్‌టి సెల్ అధ్యక్షుడు ఎం.సుబ్బయ్య సారధ్యంలో పలు ప్రాంతాల్లో కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణంలోని అన్నా క్యాంటిన్ వద్ద పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్ సారధ్యంలో పేదలు వేలాది మందికి అన్నదానం జరిపారు. బిసి బాలికల వసతి గృహంలో విద్యార్థులకు నూతన ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి ఎంఎల్‌ఏచే ప్రారంభోత్సవం చేయించారు. 18 వార్డుమాజీ కౌన్సిలర్ నివేదికమోరే, రాష్ట్ర పార్టీ బిసి కార్యదర్శి డాక్టర్ ఉమేష్‌రావు సారధ్యంలో జయరామారావువీధిలో ప్రత్యేక ప్రతిభావంతులచే కేక్ కటింగ్ చేయించారు. 24వ వార్డు మాజీ కౌన్సిలర్ బీమాల మునికృష్ణయ్య మిత్ర బృందం వి.సిద్దులయ్య, కె.అనుదీప్, సుబ్బ, ఆర్ శ్రీనివాసులు. బి.నాదముని, టి.భరత్ కుమార్ ఆర్.రాజశేఖర్‌ల సారధ్యంలో గాలి గోపురం వద్ద 75కిల్లో భారీ కేక్‌ను శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డిచే కట్ చేయించారు. రామసేతు సమీపంలోని అన్నా క్యాంటిన్ వద్ద బిసి నాయకుడు పోలూరు శ్రీనివాసులురెడ్డి సారధ్యంలో అన్నదానం జరిపారు. పట్టణ మార్వాడీలు నక్కల కాలువ వద్ద అన్నదానం ఏర్పాటు చేయగా శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి ఆయన మాతృమూర్తి బొజ్జల బృందమ్మ, చెంచయ్య నాయుడు,మీడియా ప్రతినిధి దుర్గా ప్రసాద్‌త దితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు



తిరుపతి క్రీడ, ఏప్రిల్ 20 ప్రభాతవార్త: తిరుపతిలోని అలిపిరి శ్రీ వెంకటేశ్వర స్వామివారి పాదాల వద్ద సీఎం నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుక లు నిర్వహించారు. టీడీపీ నాయకులు కొబ్బరికాయలు కొట్టి వేడుకలు నిర్వహించారు. సీఎం జన్మదిన వేడుకల్లో తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శాప్ చైర్మన్ రవినాయుడు, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మాజీ శాసనసభ్యురాలు సుగుణమ్మలు పాల్గొన్నారు. రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం చంద్రబాబు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఎం చంద్రబాబుతోనే భావితరాల భవిష్యత్తు అని శాప్‌చైర్మన్ రవినాయుడు కొని యాడారు. అభివృద్ధి, సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్ ప్రజాసేవ కోసం అనునిత్యం శ్రమించే నాయకుడు సీఎం చంద్రబాబు అని కొనియాడారు. స్పోర్ట్స్ కోటా 3శాతం అమలుకు జీవో ఇచ్చిన సీఎంకు క్రీడాకారుల తరుపున జన్మదిన శుభాకాంక్షలతో పాటు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. నిరుద్యోగుల కల నెరవేర్చేందుకు మెగా డీఎస్సీ నోటిపికేషన్ విడుదల శాప్ చైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల, నిరుపేదల అభివృద్ధే ధ్యేయంగా సీఎం పనిచేస్తున్నారు. అలుపెరగని నిత్యకృషీవలుడు, అభివృద్ధి ప్రదాత సీఎం చంద్రబాబు అని తెలిపారు.

## చంద్రబాబు నేతృత్వంలోనే రాష్ట్ర పురోభివృద్ధి : గాలి భానుప్రకాశ్





పుత్తూరు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం రెండింటి లోనూ పురోభివృద్ధి సాధిస్తోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. ఆదివారం పుత్తూరు పట్టణంలో నిర్వహించిన చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొని పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 75 ఏళ్ల వయస్సులో కూడా నవ యువకుడిలా పరిపాలనలో తన దైన ముద్ర వేస్తూ ముందుకు సాగుతున్నారని తెలిపారు. గతంలో సైబరాబాద్, ప్రస్తుతం అమరావతి నగర నిర్మాణాల్లో ఆయనకు ఆయనే సాటి అని ప్రశంసించారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంజి మాధవయ్య, నాయకులు డి.ఎన్.ఏలుమలై, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాలి జీవరత్నంనాయుడు, ఎన్.ఎన్.ధనపాల్ తదితరులు పాల్గొన్నారు.

**ఎం.బి.రోడ్డులో:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలను స్థానిక ఎంబి రోడ్డులోని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ పుత్తూరు మండల మాజీ అధ్యక్షుడు విజయశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు దాసరి విజయ్‌చౌదరి, గాలి సుబ్రమణ్యంనాయుడు, రవియాదవ్, కుమార్‌రెడ్డి, చంద్రయాదవ్, అజయ్‌చౌదరిలు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## పులివేంద్రలో రీసర్వే రైతులకు ఎంతోమేలు




తడ, ఏప్రిల్ 20 ప్రభాతవార్త: మండలం కొండూరు పంచాయతీ పరిధిలోని పులివేంద్ర గ్రామాన్ని భూ సర్వేకు ఎంపిక చేసినట్లు తహశీల్దార్ ఎన్.శరత్ బాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో భూ రీసర్వే ప్రాధాన్యత గురించి ప్రదర్శన జరిపారు. రైతులతో ఆయన మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టుగా పులివేంద్రను ఎంపిక చేశామని, మీ భూమికి, మీ పేరు, ప్రతి భూమికి సరిహద్దులు, రికార్డులు ఈ రీసర్వే ముఖ్య ఉద్దేశమన్నారు. నూతన విధానంలో భూసర్వే చేపట్టడం జరుగుతుందని, భూ యజమానులైన రైతులకు సర్వే జరుగుతున్న సమయాన్ని ముందుగానే నోటీసు ద్వారా, ఎస్ఎంఎస్ ఫోన్ కాల్స్ ద్వారా, వాట్సాప్ సందేశం ద్వారా తెలియజేస్తామన్నారు. సర్వే రికార్డుల్లోని తేడాలను, రెవెన్యూ రికార్డుల్లోని తేడాలను, సవరణల కోసం ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్లు, విఆర్ఓ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## చంద్రబాబు హయాంలోనే తీరప్రాంతాల అభివృద్ధి



తడ, ఏప్రిల్ 20 ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు తీరప్రాంతాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తడ మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలను తడలో ఘనంగా జరుపుకు న్నారు. స్థానిక బజారు సెంటర్లో భారీ కేక్‌తో నాయకులు, కార్యకర్తలు జై చంద్రబాబు నినాదాలిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొమ్మన్ శ్రీధర్, రాష్ట్ర బిసి సాధికార సమితి సభ్యుడు బొమ్మన్ పళణి, వన్నియార్ సంఘ సభ్యుడు కెలివి సెల్వం, తెలుగు యువత రవి, మండల ప్రధాన కార్యదర్శి ఆర్.నీలకంఠం, జాలర్ల నాయకులు శివాజీ, సుధాకర్, ఏకాంబరం, దేశప్పన్, మనోహర్, తెలుగు మహిళా నాయకులు విజయమ్మ, శంకుతలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కొండూరులో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి



తడ, ఏప్రిల్ 20 ప్రభాతవార్త: మండలం కొండూరులో ఇంజినీరింగ్ విద్యార్థి మీంజూరు దినేష్ (20) మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఈ విద్యార్థి కొంతకాలంగా గుండెజబ్బుతో బాధపడు తున్నాడు. గుండె మార్పిడి శస్త్ర చికిత్స కోసం కొందరు దాతలు ముందుకు వచ్చారు. స్నేహితుల సహకారంతో కొంతమొత్తం సమకూర్చుకున్నారు. ఈ నేపథ్యంలో త్వరలోనే ఆపరేషన్ జరుగుతుందని, తెలివైన ఈ విద్యార్థి ప్రాణాపాయం నుంచి తప్పించుకుంటాడని అంతా భావించారు. అయితే ఉన్నట్టుండి తన సొంత ఇంట్లోనే కళ్లు తిరిగి పడిపోవడంతో సమీపంలోని సూళ్లూరుపేట ఆసుపత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. దీంతో కొండూరులో విషాదం నెలకొంది. ఈ విద్యార్థి జెఎన్‌టియు అనంతపూర్‌లో సెకండియర్ సివిల్ ఇంజినీరింగ్ చదువుతున్నాడు.

## ఘనంగా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు

గూడూరు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త : డాక్టర్ ఏ.పీ.జే. అబ్దుల్ కలామ్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం 75 మంది కూలీలు, గిరిజనులకు అన్న దానం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు, ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ తాజుద్దీన్ మాట్లాడుతూ విజన్ కలిగిన నాయకుడు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఆయన 75వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరు రెండవ పట్టణంలోని నిమ్మ మార్కెట్, నెల్లటూరు చెరువు కట్టపై ఉంటున్న గిరిజన కుటుంబాలకు అన్న దానం చేశామన్నారు. గత పదేళ్లుగా ఏపీజే ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నా మన్నారు. ట్రస్ట్ సభ్యులు ఎల్లోజు రవికుమార్, వి. శ్రీనివాసులు, దగ్గోలు సురేంద్రబాబు తదితరులు మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు షేక్ కరిముల్లా, సయ్యద్ న్యామతుల్లా, సయ్యద్ బరకతుల్లా, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు



వాకాడు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త: పట్టణంలోని అశోక పిల్లర్ సెంటర్‌లో ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు జన్మదిన వేడుకలను మండల టిడిపి కమిటీ ఘనంగా నిర్వహిం చారు. భారీ కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు వచ్చినటువంటి అభిమానులకు కేకును పంచిపెట్టారు. ఈ సందర్భంగా మండల పార్టీ కన్వీనర్ మధుసుధన్‌రెడ్డి మాట్లాడుతూ పేదల ప్రభుత్వం టిడిపి పార్టీ అని, పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి చంద్రబాబు నాయుడు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోట శ్రీనివాసులు, సన్నారెడ్డి విజయ శేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, మాజీ జెడ్పిటిసి సభ్యులు ప్రమీల, తిరుమూరు శ్రీనివాసరెడ్డి, ద్వారక నాథరెడ్డి, హరీష్ నాయుడు, గంగాధర్ రెడ్డి, సన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, నెల్లిపూడి టిడిపి పార్టీ నాయకుడు ఏం బేటి పోలయ్య, కుంభాల రమణయ్య, మోహన్ నాయుడు, గోపి నాయుడు, దారా సుబ్బారావు, వాకాడు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య!

చిల్లకూరు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త: మండల పరిధిలోని భోద నం గ్రామంలోని అరుంధతి వాడకి చెందిన పదవ తరగతి చదువుతున్న కంటేపల్లి మహాలక్ష్మి (16) శనివారం మహాలక్ష్మికి స్నేహితురాలుకి మధ్య జరిగిన చిన్నపాటి గొడవతో మనస్థాపానికి గురైన మహాలక్ష్మి శనివారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకొని మృతి చెందింది సమాచారం తెలుసుకున్న చిల్లకూరు ఎస్ఐ సురేష్ బాబు సంఘటన స్థలాన్ని చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థి మృతి చెందిన విషయం ఆ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## చంద్రబాబుకు సంపూర్ణ ఆయురారోగ్యాలు కలగాలి

**-పేదలకు కంకణాల అన్నదానం**



తిరుపతి,ఏప్రిల్ 20ప్రభాతవార్త: రాష్ట్రప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సంపూర్ణ ఆయురారోగ్యాలు కలగాలని శ్రీవారిని వేడుకున్నారు. తెలుగుయువత రాష్ట్ర అదికారప్రతినిధి కంకణాల రజినీకాంత్‌నాయుడు ఆధ్వర్యంలో చంద్రబాబు పుట్టినరోజును పేదల మధ్య జరుపుకుని అన్నదానం చేశారు. బాబు 75వ జన్మదినాన వెయ్యిమంది నిరుపేదలకు,అనాధలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సూరాసుదాకర్‌రెడ్డి, వట్టికుంట చిన్నబాబు, మబ్బుదేవనారాయణరెడ్డి, పులిగోరు మురళి, కోడూరు బాలసుబ్రమణ్యం, గాలిపవన్ చౌదరి, దొడ్డారెడ్డి ప్రకాశ్, ఈతమాకుల హేమంత్‌యాదవ్,జలపోతు చంద్ర, మురళీకృష్ణ పాల్గొన్నారు.

## ఏమ్మా... పులిహోరా బాగుందా : ఎంఎల్ఏ





శ్రీకాళహస్తి,ఏప్రిల్ 20 ప్రభాతవార్త: 'ఏమ్మా! పులిహోరా బాగా ఉందా? అంటూ ఓ భక్తురాలిని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆదివారం ప్రశ్నించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేరు మీద పూజలు అభిషేకాలు జరిపి తిరుగు ప్రయాణంలో క్యూలైన్లలో ఉన్న భక్తులతో ఎంఎల్ఏ మమేకమయ్యారు. ఓ భక్తురాలి చేతిలో పులిహోరా పాకెట్ ఉండగా ఆమెను ప్రసాదం ఎలా ఉందని విచారించారు. ఆమె ప్రశ్నార్థకంగా చూడటంతో వెంటనే ఆమె నుంచి చేతిలో పులిహోర తీసుకొని రుచి చూసారు. ఓహో! కారంగా ఉందా? నీకు నచ్చలేదా? అంటూ ముందుకు సాగారు.కారం ఎక్కువ,పులుపు తక్కువ ఉందని ఎంఎల్ఏ అభిప్రాయపడ్డారు. ఉచిత ప్రసాదం పంపిణి కౌంటర్ వద్ద ఉండాల్సిన ఉద్యోగి లేకపోవటంతో క్యూలైన్లలో భక్తులు నిండిపోయారు. ఇక్కడ పని చేయాల్సిన ఉద్యోగి ఎక్కడ అంటూ ప్రశ్నించగా అప్పుడే అక్కడ విధి నిర్వహిస్తున్న ఉద్యోగి వచ్చారు. తాను టిఫిన్‌కు వెళ్ళానని చెప్పటంతో మీ వల్ల ఇంత మంది భక్తులు నిరీక్షించాలా? అంటూ ముందుకు సాగారు.

**పోటులో అణువణువు పరిశీలన:**

భక్తులు పులిహోర ప్రసాదంపై అసంతృప్తి వ్యక్తం చేయటంతో వెంటనే ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి ప్రసాదాలు తయారు చేసే పోటులోకి వెళ్ళారు.అక్కడ ఇన్‌చార్జి లేదు. అయితే లడ్డు తయారి కేంద్రాన్ని,అలాగే వడ తయారు చేస్తున్న విధానాలను, పులిహోర కలుపుతున్న ప్రదేశాన్ని నిశితంగా పరిశీలించారు. అలాగే వాడే వస్తువుల నాణ్యతను పరిశీలించారు. దిట్టంతో పాటు రికార్డులను పరిశీలించారు. అక్కడ పని చేస్తున్న వారితో మాట్లాడారు. పులిహోరలో ఎందుకు కారం ఎక్కువైందనే అంశాన్ని విచారించారు. భక్తులకు అందించే ప్రసాదాలు రుచికరంగా ఉండాలని,అలాగే తయారు చేసే వారు జాగ్రత్తగా పని చేయాలన్నారు. అక్కడ పారిశుభ్రం చక్కగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేసారు.